

మరిన్ని కథనాల
కోసం
యూట్యూబ్‌లో
ప్రసారమవుతున్న
మీ
SREECHAKRA
NewsTVని
వీక్షించవచ్చు.
ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్,



https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 202 | కర్నూలు | మంగళవారం ఆగష్టు 19 202

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







# విషం చిమ్ముతున్న వైకాపా నేతలు

### అదేపనిగా సొంత పత్రిక, ఛానళ్లలో తప్పుడు వార్తలు
### వీటిని ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలి
### అర్హులైన వారికే నామినేటెడ్ పదవుల పంపిణీ



అమరావతి,ఆగస్ట్18( నిత్యం విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం చేయడమే వైకాపా పని అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. రాజధాని మునిగిపోయిందని.. ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయంటూ సొంత టీవీ, పత్రికలు, అనుబంధ మీడియాలో వైసిపి నేతలుఅసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిపై అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ఖండించాలని అన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, తెదేపా నేతలతో సీఎం -టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'సుపరిపాలనలో తొలి అడుగు', పార్టీ కమిటీల నియామకం తదితర అంశాలపై నేతలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వైకాపా దుష్ప్రచారంపై స్పందించారు. తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు ఖండించాలని నేతలకు ఆయన పిలుపునిచ్చారు.రాజధానిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఊళ్లు మునుగుతాయని ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. రాజధాని కోసం పొన్నూరును ముంచారని ఒకసారి వార్త వేశారు. కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పనిచేయడం లేదని మరోసారి ప్రచారం చేశారు. ప్రకాశం బ్యారేజ్ ప్రమాదంలో పడిందని ఓ సారి వార్త వేశారు. తప్పుడు ప్రచారంతో గందరగోళం సృష్టించాలని వైకాపా యత్నిస్తోంది. వీటిని ఎప్పటికప్పుడు ఖండించాలి. ఈ విషయంలో మంత్రులు, పార్టీ నేతలు చొరవ చూపాలి. ఖండించకపోతే తప్పుడు ప్రచారాలనే నిజం అనే స్థాయికి తీసుకెళ్తారు. మంచి గురించే కాదు.. చెడు చేసేవారి గురించీ ప్రజలను చైతన్య పరచాలని సిఎం సూచించారు. రాజకీయ ముసుగులో ఉండే రౌడీలను కట్టడి చేసే విషయంలో కఠినంగా ఉంటామని హెచ్చరించారు. ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. నాయకుడు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలి. అసత్య ప్రచారాలను దృష్టిలో పెట్టు-కుని మరింత క్రమశిక్షణతో ఉండాలి. మీ మాట, చర్య ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా ఉ ండకూడదు. ఏ ఒక్కరూ వివాదాలకు ఆస్కారం ఇవ్వకూడదు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల కోసం నామినే-టెడ్ పదవులను భర్తీ చేస్తున్నాం అని అన్నారు. ఇతర పదవుల భర్తీ కూడా త్వరలోనే చేపడతాం. పార్టీ కమిటీలను సాధ్యమైనంత వరకు ఈ నెలాఖరుకు పూర్తిచేయాలి. పులివెందుల, ఒంటిమిట్టలో విజయానికి కృషి చేసిన నేతలకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నిక కూటమి అభ్యర్థులు గెలవాలని చంద్రబాబు అన్నారు.

# ఢిల్లీలో బిజీగా మంత్రి లోకేశ

### కేంద్రమంత్రులతో వరుస భేటీలు
### ఆంధ్రప్రదేశ్‌లో డేటా సిటీ ఏర్పాటుకు వినతి
### బీపీసీఎల్ రిఫైనరీ త్వరితగతిన నిర్మించేందుకు సహకారం
### వివిధ రోడ్డు ప్రాజెక్టులపై నితిన్ గడ్కరీతో చర్చలు







న్యూఢిల్లీ,ఆగస్ట్18 : ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ మంత్రి నారా లోకేశ్.. పలువురు కేంద్ర మంత్రులతో భేటీ- అయ్యారు. విదేశాంగమంత్రి జైశంకర్, జేపీ నడ్డా, హర్దీప్‌సింగ్ పురీ, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో డేటా సిటీ ఏర్పాటుకు సహకారం అందించాలని జైశంకర్‌ను కోరారు. ఇటీవల ఏపీ బృందం సింగపూర్ పర్యటన వివరాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం సింగపూర్ ప్రభుత్వంతో జరిపిన చర్చల గురించి కేంద్ర మంత్రికి నారా లోకేశ్ వివరించారు. జేపీ నడ్డాతో సమావేశమైన రాష్ట్రంలో యూరియా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21 నాటికి సమస్యను పరిష్కరిస్తామని ఆయనకు నడ్డా హామీ ఇచ్చారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీని కూడా మంత్రి లోకేశ్ కలిశారు. బీపీసీఎల్ రిఫైనరీ త్వరితగతిన నిర్మించేందుకు సహకారం అందించాలని కోరారు. ఓఎన్‌జీసీకి చెందిన జాక్ ఆఫ్ రిగ్ కాంట్రాక్టు సాధనకు సహకరించాలని కోరారు. ఏపీలో దీపం-2 పథకానికి మరింత సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. నిర్మలా సీతారామన్‌ను ఆయన కలిశారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్.. ఆర్థిక ఇబ్బందుల నుంచి రాష్ట్రం గట్టెక్కేందుకు సహకరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్రమంలో కేంద్ర ఉపరితల రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీతో నారా లోకేష్ భేటీ అయ్యారు. పలు కీలక అంశాలపై చర్చించారు. విజయవాడ బెంజి సర్కిల్ వద్ద ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా కానూరు - మచిలీపట్నం నడుమ ఆరులైన్ల రోడ్డు విస్తరణకు వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ భేటీకి సబంధించిన వివరాలను మీడియాకు మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన కానూరు - మచిలీపట్నం రోడ్డు విస్తరణ ద్వారా విజయవాడలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతోపాటు- రాజధాని ప్రాంత అభివృద్ధికి కూడా ఉపకరిస్తుందని తెలిపారు. హైదరాబాద్ - అమరావతి మధ్య కనెక్టివిటీలో ఎన్ హెచ్ 65 కీలక పాత్ర పోషిస్తుందని ఉద్ఘాటించారు. ఇప్పటికే మంజూరైన హైదరాబాద్ - గొల్లపూడి రహదారి విస్తరణ ప్రాజెక్టును అమరావతితో అనుసంధానించేలా అదనపు పోర్టు లింకేజిని డీపీఆర్‌లో చేర్చాలని సూచించారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి తూర్పు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ఎన్‌హెచ్ - 16 వెంట విశాఖపట్నంలో 20 కిలోమీటర్లు, విజయవాడలో 14.7 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ÷-లపై ఓవర్ ఫ్లస్ మెట్రో కారిడార్లను నాగపూర్ మోడల్‌లో అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైందని వివరించారు.

# మాజీమంత్రి కాకాణికి షరతులతో బెయిల్

### తెలుగు రాష్ట్రాలు దాటి వెళ్లరాదని హైకోర్టు ఆంక్షలు



అమరావతి,ఆగస్ట్18( మైకా అక్రమ మైనింగ్ కేసులో మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ బెయిల్ మంజూరు చేసింది. కాకాణికి న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చింది. ప్రస్తుతం నెల్లూరు జైల్లో కాకాణి రిమాండ్‌లో ఉన్నారు. దర్యాప్తు అధికారి దగ్గర పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని కాకాణికి హైకోర్ట్ షరతు విధించింది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలను దాటి వెళ్లడానికి వీల్లేదని కండీషన్ పెట్టింది. ఛార్జిషీట్ దాఖలు చేసే వరకు నెల్లూరు జిల్లాలో అడుగు పెట్టరాదని షరతు విధించింది. మరోవైపు.. క్వార్ట్జ్ అక్రమ రవాణా కేసులో ముద్దాయిగా రిమాండ్‌లో ఉ న్నా వైసీపీ నేత బిరదవోలు శ్రీకాంత్ రెడ్డికి అస్వస్థతకు గురయ్యారు. గుండెనొప్పితో నెల్లూరు జీజీహెచ్‌లో చేరారు శ్రీకాంత్ రెడ్డి. రుస్తుం మైనింగ్ కేసులో ఏ-12గా రిమాండ్ ఖైదీగా ఉన్నారు శ్రీకాంత్ రెడ్డి. ఆయనకు గుండె నొప్పి రావటంతో జైలు అధికారులు, వైద్యుని ఆదేశాలతో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జీజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో వైద్య పరీక్షలు చేసి ప్రిజనర్స్ వార్డులో ఉంచి వైద్యం అందిస్తున్నారు. స్పెషల్ రూం కావాలని శ్రీకాంత్ రెడ్డి కోరగా జైలు అధికారులు నిరాకరించారు.

# లంచానికి ఆశపడి భారీ మూల్యం చెల్లించుకోనున్న జిల్లా వైద్యాధికారి

**రూ.30 వేలు లంచం తీసుకున్నట్లు ఎసిబి ప్రత్యేక కోర్టు నిర్ధారణ తక్షణమే పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపులు నిలిపివేయాలని మంత్రి ఆదేశం**

అమరావతి, ఆగస్టు 18 (శ్రీచక్ర): గతంలో కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి(డిఎంహెచ్ ఓ)గా డా.ఎం. మీనాక్షి మహదేవ్ పనిచేస్తూ రూ.30 వేలు లంచానికి ఆశపడిన ఒక డాక్టరుకు నేడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఎదురైంది. 2017లో ఆ అధికారి ఒక ప్రైవేట్ ఆసుపత్రి మరియు స్కానింగ్ సెంటర్ సేవల కొనసాగింపునకు ( రెన్యువల్) లంచం అడిగినట్లు సమాచారం అందడంతో అవినీతి నిరోధక శాఖ(ఎసిబి) అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ విషయంలో ఎసిబి 2019లో నమోదు చేసిన కేసుపై విచారణ చేపట్టిన కర్నూలు ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం గత నెల ఇచ్చిన తీర్పులో సదరు వైద్యాధికారి లంచం తీసుకున్నట్లు నిర్ధారించింది. ఈ నేపథ్యంలో 2020లో పదవీ విరమణ చేసిన సదరు అధికారికి నియమాల ప్రకారం పింఛను మరియు గ్రాట్యుటీ చెల్లింపులను తక్షణమే నిలిపివేయాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఆదేశాలిచ్చారు. ముడుపుల ఆరోపణలో న్యాయస్థానంలో విచారణ ఎదుర్కొంటున్న ఆ అధికారి 2020లో పదవీ విరమణ చేశారు. నియమాల ప్రకారం ఆ అధికారికి పింఛను మొత్తంలో 75 శాతాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. వైద్యారోగ్య శాఖామంత్రి నేటి ఆదేశాలతో ఈ నెల నుంచి పెన్షన్ చెల్లింపును నిలిపివేస్తారు. ఆంధ్రప్రదేశ్ సవరించిన పెన్షన్ నిబంధనలు,1980 ప్రకారం ముడుపుల కేసుల్లో దోషులుగా నిర్ధారణ అయిన వారికి పింఛను, గ్రాట్యుటీ చెల్లింపులు చేయబడవు. 2020లో నమోదైన ఈ కేసులో సదరు కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారిని గత నెలలో దోషిగా నిర్ధారించి ఒక ఏడాది పాటు కఠిన కారాగార శిక్షను, రూ.10 వేలు జరిమానాను కర్నూలు ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం విధించింది. ప్రస్తుత నియమాల ప్రకారం 62 ఏళ్లకు పదవీ విరమణ చేసిన డిఎంహెచ్ఓలకు జీవితకాలం నెలకు సుమారు రూ.1 లక్షకు పైగా పెన్షన్ పొందే అవకాశముంది. దీంతోపాటు సుమారు రూ.20 లక్షలు గ్రాట్యుటీ అందుతుంది. రూ.30 వేలు లంచానికి ఆశపడిన సదరు కర్నూలు జిల్లా వైద్యారోగ్య అధికారి ఈ మొత్తాన్ని కోల్పోయే పరిస్థితి ఎదురైంది.

# మహిళాభ్యున్నతికి స్త్రీశక్తి ఊతం


### ఉచితబస్సుతో మహిళల్లో ఆనందం
### దీనిని కూడా ఓర్వలేని వ్యక్తి జగన్
### మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అమరావతి,ఆగస్ట్18( ): రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకం సూపర్ హిట్ అయిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. మహిళలు ఆనందంగా ఉన్నారని అన్నారు. ఇప్పుడు మహిళలు రాష్ట్రంలో ఎక్కడినుంచి ఎక్కడికైనా వెళ్లగలుగుతున్నారని అన్నారు. అమరావతిలో జరిగిన మీడియాతో మాట్లాడుతూ, రోజుకు 25 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు సేవలు వినియోగించుకుంటు న్నారని అన్నారు. మహిళలు ఈ పథకం పట్ల ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ పథకం విజయాన్ని చూసి వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి, ఆ పార్టీ నేతలు కడుపు మంటతో ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తున్నాం. రాష్ట్రంలోని మహిళలందరినీ సమాన దృష్టితో చూస్తూ కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్ సదుపాయం కల్పిస్తోంది. వ్యాపారం చేసుకునేవారు, చిరుద్యోగులకు నెలకు 2 నుంచి మూడు వేలు మిగులుతుంది. మహిళలతొ పాటు- ట్రాన్స్ జెండర్‌లకు కూడా అవకాశం కల్పించాం. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచి ఎక్కడి-కై-నా.. ఎన్ని సార్లయినా ఫ్రీ బస్ సౌకర్యం అందిస్తోంది కూటమి ప్రభుత్వం. ఈ విజయం చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఇష్టమొచ్చిన ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. భరతమాత అంటే కూడా గౌరవం లేని వ్యక్తి జగన్. సీఎంగా పనిచేసి కూడా కనీసం ఆగస్టు 15న జాతీయ జెండా ఎగరవేయలేదు. తల్లినీ, చెల్లినీ కోర్టు మెట్లెక్కించాడు. ఇలాంటి వ్యక్తి మీడియా ముందుకు వచ్చి దారుణంగా లింకులు లేకుండా మాట్లాడుతున్నారు. మీ ప్రభుత్వంలో పింఛన్ 250 రూపాయలు పెంచడానికి సంవత్సరం పట్టింది. వెయ్యి రూపాయలు పెంచడానికి 5 ఏళ్ళు పట్టింది. ఇంట గెలవలేదు.. రచ్చ గెలవలేదు. మీకు ప్రతిపక్షహదా ఇవ్వలేదని ప్రజలపై అక్కసు వెళ్లగక్కుతున్నారని వైసీపీపై ధ్వజమెత్తారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం వంటి పథకాలతో మహిళలు ఆనందంగా ఉన్నారు. ఇది చూసి జగన్‌కు అసహనం కలుగుతోంది. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ మహిళలకు ప్రయోజనం కలుగుతుందన్న విషయాన్ని వైఎస్సార్‌సీపీ నేతలు అర్థం చేసుకోవాలి. ప్రజలపై అక్కసుతో మాట్లాడితే, ఇప్పటికి ఉన్న 11 స్థానాలే కాదు, అవి కూడా పోతాయి అంటూ హెచ్చరించారు. అలాగే మాజీ మంత్రి రోజా వ్యాఖ్యలపై కూడా మంత్రి సంధ్యారాణి స్పందించారు. మహిళల అభ్యున్నతిని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్న చంద్రబాబుపై విమర్శలు చేయడం తగదన్నారు. జబర్దస్త్ వ్యవహార శైలిని ఇప్పటి-కైనా మార్చుకోవాలని సూచించారు.



# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

### పలు జిల్లాల్లో జోరుగా కురుస్తున్న వర్షాలు
### చెరువులను తలపిస్తున్న రహదారులు
### రైళ్ల రాకపోకలు క్రమబద్ధీకరణ



విశాఖపట్నం,ఆగస్ట్18( ): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో ఏపీలోని పలు జిల్లాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేస్తోంది.. ఇక, వాయుగుండం ఎఫెక్ట్‌తో ఉత్తరాంధ్రవ్యాప్తంగా కుండపోత వర్షం కురుస్తోంది.. ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.. అల్పపీడన ప్రభావంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విస్తారంగా వర్షం కురుస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో అత్యధికంగా 16.1 సెం.మీ వర్షపాతం నమోదైంది. అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలో 15.5 సెం.మీ, మాడుగుల, కె.కోటపాడులో 15 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వానలతో జనం ఇబ్బందులు పడుతున్నారు. రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగి నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

## కొత్త బార్ పాలసీ లాటరీ/ద్వారా దరఖాస్తుల ఆహ్వానము:జిల్లా కలెక్టర్ గజట్ నోటిఫికేషన్ జారీ



కర్నూలు, ఆగస్టు (శ్రీచక్ర); జిల్లా ఎక్సయిజ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 18 నుండి 26 వరకు దరఖాస్తులు స్వీకరణ 28 తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా లాటరీ నిర్వహించి బార్ దరఖాస్తుదారులను ఎంపిక చేసి, జిల్లా ఎక్సయిజ్ అధికారి వారికి లైసెన్స్ లను మంజూరు చేస్తారు. మునుపటి 2022?25 వేలం వ్యవస్థలో సమూల మార్పులతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త బార్ పాలసీ 2025?28న ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా బార్ల కేటాయింపు మరియు నిర్వహణలో పారదర్శకత, న్యాయబద్ధత, వ్యాపార ఆర్థిక స్థిరత్వంతో మేళవించిన కొత్త బార్ పాలసీ కర్నూలు జిల్లాలో (23) బార్ లైసెన్స్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానించనున్నారు. విధానం యొక్క ముఖ్య లక్షణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. కొత్త బార్ పాలసీ 2025?28 యొక్క ముఖ్యమైన లక్షణాలు జిల్లా కలెక్టర్ చే డ్రా పద్ధతి ద్వారా బార్స్ ఎంపిక– రూ 5 లక్షలు తగ్గించబడిన దరఖాస్తు రుసుము వేలాలకు బదులుగా పారదర్శక లాట్ల డ్రా ద్వారా బార్‌లను కేటాయించబడతాయి. అప్లికేషన్ కి రూ 5 లక్షల ఫీజు + ?10,000 వేలు ప్రాసెసింగ్ ఫీజు, కొత్త విధానం అన్ని అడ్డంకులను తగ్గిస్తుంది. న్యాయం, పోటీతత్వాన్ని నిర్ధారించడానికి బార్‌కు కనీసం 4 దరఖాస్తులు అవసరం. తక్కువ లైసెన్స్ ఫీజులు రిటైల్ దుకాణాలతో పోలిస్తే తక్కువ లైసెన్స్ ఫీజు రూ 35 లక్షలు ( 50,000 వరకు జనాభా) రూ 55 లక్షలు (50,00 పైబడి ?5 లక్షల వరకు జనాభా)?రూ 75 లక్షలు ( 5 లక్షల పైబడి జనాభా)పొడిగించిన వ్యాపార సమయాలుబార్లు ఉదయం 10:00 నుండి అర్ధరాత్రి 12:00 వరకు (14 గంటలు) అనుమతించబడ్డాయి.సౌకర్యవంతమైన లైసెన్స్ ఫీజు చెల్లింపు నిబంధనలు లైసెన్స్ రుసుమును 6 సమాన వాయిదాలలో/ ఇన్స్టాల్మెంట్స్ చెల్లించవచ్చును. ఒక ఇన్స్టాల్మెంట్ కి సరిపడా బ్యాంక్ గ్యారెంటీ ఇస్తే చాలు. ౦4 దుకాణాలతో పోటీ పడేలా ( లేవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ) వ్యాపారం బార్లు కూడా ౦4 దుకాణాల మాదిరిగానే ఏపీఎస్బీసీఎల్ నుండి స్టాక్‌ను కొనుగోలు చేస్తాయి. అరేట్ చెల్లింపులు బ్యాంక్ గ్యారెంటీ ఇది. సరళీకృత ప్రవేశ నిబంధనలుముందుగా ఉన్న రెస్టారెంట్ తప్పనిసరి కాదులైసెన్స్ పొందినవారు లైసెన్స్ పొందిన 15 రోజుల్లోపు రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు.కొత్త విధానం యొక్క ముఖ్య ప్రయోజనాలులాటరీ ద్వారా పారదర్శకతను ప్రోత్సహిస్తుంది, అవకతవకలకు అవకాశం లేకుండా చేస్తుంది.తక్కువ ఖర్చులు ముఖ్యంగా కొత్త వ్యవస్థాపకులకు ఎంతో ఈజీ ఆఫ్ డూయింగ్‌తగ్గిన రుసుములు మరియు వాయిదాల చెల్లింపు సౌకర్యంతో ఆర్థికంగా వ్యాపారం స్థిరంగా ఉంటుంది. పొడిగించిన పని గంటలు వ్యాపార సాధ్యత మరియు వినియోగదారుల సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయి. పట్టణ మరియు సెమీ–అర్బన్ ప్రాంతాలలో కార్పొరేషన్ లో 10 కిలోమీటర్లు మరియు మునిసిపల్ ఏరియాలో 3 కిలోమీటర్లు బెల్ట్ ఏరియాలో బార్స్ ఏర్పాటు కు అందరికి సమాన అవకాశాలు.

## తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. -ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి



మంత్రాలయం ఆగస్టు 18,(శ్రీచక్ర) :మంత్రాలయం నియోజకవర్గంలోని తుంగభద్ర నది తీరంలో ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు. సోమవారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తుంగభద్ర డ్యాం నుంచి దిగువ కు లక్ష నుంచి లక్షన్నర క్యూసెక్కుల మేర నీటి విడుదల అయిన నేపథ్యంలో ఎవరూ కూడా నదిలోకి వెళ్లకూడదని ముఖ్యంగా పశువుల కాపరులు, చేపల వేటకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. దీనికి తోడు వర్షాలు కురిస్తుండటంతో విద్యుత్ శాఖ అధికారులు ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ శివారులో ఉన్న వాగులు, వంకలు ప్రవహించే సమయంలో వాగు దాటేందుకు ప్రయత్నం చేయకూడదన్నారు. నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో మాట్లాడి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరధ్వాజ్ కు ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఫోన్ ద్వారా కోరారు. తుంగభద్ర నదికి నీటిని విడుదల చేయడంతో దిగువన ఉన్న సుంకేసుల రిజర్వాయర్ నుంచి కూడా నీటి విడుదల కొనసాగుతుంది. తీర ప్రాంత ప్రజలు ఎవ్వరూ భయాందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు.

## రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటాం వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం ఆగస్టు 18 (శ్రీచక్ర) :వైసీపీ కార్యకర్త మంగలి రామకృష్ణ కుటుంబానికి అండగా ఉంటామని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి అన్నారు. మంత్రాలయం మండల కేంద్రంలోని రామచంద్ర నగర్ కాలనీ కి చెందిన వైసీపీ కార్యకర్త మంగలి రామకృష్ణ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ సోమవారం మృతి చెందాడు. ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికి దృష్టికి సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తీసుకుని వెళ్లడంతో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు, వైస్సార్సీపీ నేత వై. ప్రదీప్ రెడ్డి సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తో కలిసి రామకృష్ణ భౌతిక కాయం కు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబానికి తక్షణ సహాయం క్రింద రూ. 10 వేల నగదును అందజేశారు. మృతుడి కుటుంబాని ఎల్లప్పుడూ అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు.



# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

### ప్రజా ఫిర్యాదుల ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి, పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, ఆగస్టు 18(శ్రీచక్ర): కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ గారి క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు మొత్తం 83 ఫిర్యాదులు వచ్చాయి. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ప్రభుత్వ పాఠశాలలలో ఫిజికల్ ట్రైనర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి విజయవాడకు చెందిన ఎంద్రపల్లి శివ , కోయిలకుంట్లకు చెందిన మధ్యవర్తి రామకృష్ణలు కలిసి నకిలీ ఉద్యోగాలు ఇచ్చి, ఏలూరులో ట్రైనింగ్ ఇచ్చి, ఆలూరులో 6 నెలల పాటు పని చేయించుకుని మొత్తం 5 మంది నుండి ఒక్కొక్కరి నుండి రూ. 2 లక్షల నుండి 4 లక్షల వరకు డబ్బులు తీసుకొని మోసం చేశారని పత్తికొండ మండలం, పులికొండ గ్రామంకు చెందిన రాజశేఖర్, నరేష్, లింగరాజు, పీటర్ పాల్ , చైతన్యలు ఫిర్యాదు చేశారు. కుమారుడిని, కోడలు మరియు కోడలు బంధువులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూల్ గణేష్ నగర్ కు చెందిన అజ్మత్ ఖాన్ ఫిర్యాదు చేశారు. ఆదోని సబ్ రిజిస్టర్ ఆఫీస్ లో జూనియర్ అసిస్టెంట్, అటెండర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి దేవదానం, జ్యోతి అనే వ్యక్తుల రూ. 5 లక్షలు తీసుకొని మోసం చేశారని కౌతాళం మండలం, చిరుతపల్లి గ్రామంకు చెందిన రాజు, మునిస్వామి లు ఫిర్యాదు చేశారు. కోడలు, కొడుకు మమ్మల్ని కొట్టి పొదుపులో వచ్చిన డబ్బులు, బంగారం తీసుకెళ్లారని తుగ్గలి మండలం, గుండాల్ తాండకు చెందిన దానమ్మ, రాముడు నాయక్ దంపతులు ఫిర్యాదు చేశారు. నాకు ముగ్గురు పిల్లలు. మా సొంత తమ్ముడు శివరాజ్ మద్యానికి బానిసై, తల్లిదండ్రులు ఇచ్చిన నా ఆస్తి బాగాన్ని నాకు తెలియకుండా వేరే వాళ్ళకు అమ్మినాడని న్యాయం చేయాలని ఆదోని, స్వామి రెడ్డి నగర్ కు చెందిన తిరుపాలు ఫిర్యాదు చేశారు. బాబు అనే వ్యక్తి నా అంగడి ముందు కూరగాయల బండి పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నాడని న్యాయం చేయాలని కర్నూలు, చౌక్ మసీదుకు చెందిన నజీర్ అహమ్మద్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటి పై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, సీఐలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ కాంప్లెక్స్ లో జాతీయ చిహ్నం సర్కిల్,ఫౌంటెన్ తో కూడిన పార్కు, సువిధ కాంప్లెక్స్ లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు,ఆగస్టు18 (శ్రీచక్ర): సోమవారం కలెక్టర్ కార్యాలయ సముదాయ ప్రాంగణం లో నవీకరించిన జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటెన్ తో కూడిన పార్క్, నూతనంగా నిర్మించిన సువిధ శానిటరీ కాంప్లెక్స్ ను జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ . కలెక్టరేట్ సుందరీకరణ లో భాగంగా ముఖ భాగంలో జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటెన్ తో కూడిన పార్కు లను నవీకరించడం జరిగిందన్నారు..పార్కు పచ్చదనంతో, ఆహ్లాదంగా ఉండేలా రక రకాల అలంకరణ మొక్కలను నాటామని కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు వచ్చే ప్రజల కోసం, కలెక్టరేట్ లోని కార్యాలయాలకు వచ్చే ప్రజల కోసం సువిధ కాంప్లెక్స్ ను నిర్మించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ కాంప్లెక్స్ సుందరంగా, పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు..ఈ కార్యక్రమంలో జాయింట్





కలెక్టర్ డాక్టర్ బి నవ్య డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, ఆర్ అండ్ బి ఎస్ఈ మహేశ్వర్ రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, పంచాయతీ రాజ్ ఎస్ ఈ మద్దన్న,డిపివో భాస్కర్, ఏవో శివరాముడు , సువిధ శానిటేషన్ సంస్థ అధిపతి సంజయ్ కుమార్ సింగ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దోమల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలి

### దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రజలకి అవగాహన కల్పించండి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, ఆగస్టు 18 (శ్రీచక్ర): దోమల నివారణ కు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో ఆగస్టు 20 వ తేదీన ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా అందుకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది "మరింత సమానమైన ప్రపంచం కోసం మలేరియా పై పోరాటాన్ని వేగవంతం చేయడం" అనే థీమ్ తో ప్రపంచ దోమల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.. దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణలో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకి అవగాహన కల్పించాలని కలెక్టర్ వైద్యశాఖ అధికారులను ఆదేశించారు.. అదే విధంగా మండల స్థాయి స్పెషల్ అధికారులు కూడా పర్యటనలకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా ప్రజలకు ఈ అంశాలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో నీటి నిల్వ ఉండే ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మురుగు కాలువలో నీరు బ్లాక్ అయిన పక్షంలో వెంటనే శానిటేషన్ సిబ్బందితో క్లీన్ చేయించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపిఓ, మున్సిపల్ కమిషనర్ లను ఆదేశించారు.. పారిశుధ్యం, నీటి ట్యాంక్ ల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియలను కూడా చేపట్టాలన్నారు. 0 నుండి 5 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు, గర్భవతులకు ఎవరికైనా జ్వరం లాంటివి ఉంటే వారిని దగ్గరగా ఉండే ఆరోగ్య కేంద్రాలకు తీసుకొని వెళ్లాలని కలెక్టర్ ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. రోడ్లు మీద గుంతలు ఉన్న చోట నీరు చేరి మలేరియా, డెంగ్యూ వ్యాధులను విస్తరింప చేసే దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉన్నందున అటువంటి చోట నీరు నిల్వ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పైప్ లైన్లు లీకేజీ ఉన్న ప్రదేశాల్లో ఫ్లష్ వాటర్ లో మలేరియా, డెంగ్యూ వ్యాధులను విస్తరింప చేసే దోమలు గుడ్లు పెట్టే అవకాశం ఉన్నందున పైప్ లైన్ లీకేజీ సమస్యలు లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శుక్రవారం "ఫ్రైడే - డ్రైడే" ను పాటించి దోమల నివారణకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. బి .నవ్య, డిఆర్ఓ సి .వెంకట నారాయణమ్మ, డిఎంహెచ్ఓ డా. శాంతి కళ, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## తుంగభద్ర డ్యాం నుండి నేడు 90 వేల క్యూసెక్కుల నీరు విడుదల

**సుంకేసుల రిజర్వాయర్ కు 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉంది**
**అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**
**గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలి**
**నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**

కర్నూలు, ఆగస్టు 18 (శ్రీచక్ర): తుంగభద్ర డ్యాం నుండి నేడు 90 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, రేపు ఉదయానికి సుంకేసుల రిజర్వాయరు కు 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం సునయన ఆడిటోరియంలో తుంగభద్ర డ్యాం నుండి నీటి విడుదలపై జిల్లా కలెక్టర్ సమీక్షిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం నుండి నేడు 90 వేల క్యూసెక్కుల వరకు నీటిని వదిలారని, ప్రస్తుతం కర్నూలు జిల్లా సరిహద్దుగా ఉన్న కౌతాళం మండలం మేళిగనూరు వరకు నీరు వచ్చిందన్నారు.. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రాలయం కు చేరుకునే అవకాశం ఉందని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. విఆర్వో ల ద్వారా గ్రామాల్లో టామ్ టామ్ ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని సబ్ కలెక్టర్, ఆర్డీవో లను ఆదేశించారు..నదీ తీర ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగకుండా తగిన




చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రేపు ఉదయానికి సుంకేసుల కు 90 వేల క్యూసెక్కుల వరకు నీరు వచ్చే అవకాశం ఉందని, భారీ వర్షాలు కురిసిన పక్షంలో 1.20 లక్షల నుండి 2 లక్షల క్యూసెక్కుల వరకు కూడా రావచ్చుని, అందువల్ల అధికారులు ముందు జాగ్రత చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు..ప్రస్తుతం సుంకేసుల రిజర్వాయరు నుండి 76 వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదలుతున్నారని కలెక్టర్ తెలిపారు. కర్నూలు నగరంలో కూడా లోతట్టు ప్రాంతాలకు నీరు వచ్చే అవకాశం ఉందని, రెవెన్యూ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# ద్రాక్షారామం పిహెచ్ సి సందర్శించిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి





రామచంద్రపురం, ఆగస్టు 18( శ్రీచక్ర)జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి వి వి సత్యనారాయణ , జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ వీరబాబు ద్రాక్షారామ పిహెచ్సి ని విజిట్ చేసి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరును పరిశీలించినారు , ద్రాక్షారామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడ పిల్లలకు వేసే వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించి సూచనలు చేసినారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బి వి వి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 18 తేదీ నుండి 23 తేదీ వరకు స్పెషల్ స్కూల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ ను జిల్లా అంతా నిర్వహిస్తున్నామని,5-7 సంవత్సరముల వయసు గల పిల్లలకు డిటిపి వ్యాక్సిన్, 10 సంవత్సరములు మరియు 16 సంవత్సరముల వయసు గల పిల్లలకు టిడి వ్యాక్సిన్ ను స్కూల్లో అందిస్తున్నామని, ఈ వ్యాక్సిన్ పిల్లల తీసుకొనటం వలన పిల్లల్లో డిఫ్తీరియా, గోరింత దగ్గు, ధనుర్వాతము వంటి వ్యాధులు రాకుండా నివారించవచ్చునని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1582 గవర్నమెంట్ స్కూల్స్, 480 ప్రవేట్ స్కూల్లోనూ ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, వేసిన ప్రతి వ్యాక్సిన్ యు విన్ పోర్టల్ లో నమోదు చేస్తున్నామని, అవసరమైన వారు సర్టిఫికెట్ కూడా పొందవచ్చని తెలిపారు. అనంతరం గురుకుల పాఠశాలపిల్లలకు వ్యాక్సిన్ వల్ల కలిగే ఉపయోగాలు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి స్వాతి భవాని , జి కమల్ శేషు డివిజన్ సూపర్వైజర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీనివాస్, వీర వేణి సిహెచ్ఓ, సూపర్వైజర్లు రత్నం , వరలక్ష్మి ,ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల పాలిట సంజీవని సిఎం సహాయనిధి.

**ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ**

**మంత్రి సుభాష్ చేతుల మీదుగా 22 మందికి 15.69 లక్షలు అందజేత**





రామచంద్రపురం, ఆగస్టు 18 (శ్రీచక్ర)నిరుపేదలకు అనారోగ్య సమయాలలో సంజీవినిగా ముఖ్యమంత్రి సహాయ నిధులు (సీఎంఆర్ఎఫ్) దోహదపడుతు న్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గారు పేర్కొన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో 22 మంది నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన రూ.15 లక్షల 69 వేల 449 రూపాయల చెక్కులను మంత్రి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన ఒక నిధని, నిరు పేదలకు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు, వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడే పేదలకు, అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే పథకమన్నారు. ఈ నిధిని దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న తెల్లకార్డుదారులు కలిగిన వారు సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలు,ఎన్టీఆర్ వైద్య సేవ పరిధిలో లేని చికిత్సలు అవసరమైనవారు ఫుడ్ సెక్యూరిటీ కార్డు ఉన్న దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు ప్రజా ప్రతినిధుల సిఫార్సుతో ఈ ఆర్థిక సహాయం వైద్య ఖర్చులు నిమిత్తం పొంద వచ్చునన్నారు. ఈ కార్య క్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు వుండవిల్లి శివ, కె గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, కూటమి పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేసే వరకు మా పోరాటం ఆగదు

**అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా**








రామచంద్రపురం, ఆగస్టు 18( శ్రీచక్ర)రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జె.ఏ.సీ) ఆధ్వర్యంలో రామచంద్రపురం రాజగోపాల్ సెంటర్ నుండి ప్రారంభమైన ప్రదర్శన, ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నాగా మారింది. ప్రజల న్యాయమైన డిమాండ్ అయిన కాకినాడ జిల్లాలో విలీనం కోసం నాయకులు గళమెత్తారు. రామచంద్రపురం నియోజకవర్గ అఖిల పక్ష జాయింట్ యాక్షన్ కమిటీ తరపున కన్వీనర్ మాగాపు అమ్మిరాజు, కో-కన్వీనర్ బి. సిద్ధూ, గౌరవ అధ్యక్షులు టిడిపి సీనియర్ నేత గరికిపాటి సూర్యనారాయణ,బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉండవల్లి గోపాలరావు, వైఎస్ఆర్ పార్టీ పట్టణ అధ్యక్షులు, గాదంశెట్టి శ్రీధర్,జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు, గొల్లపల్లి కృష్ణ ఉద్యోగ సంఘాల జెఏసీ అధ్యక్షులు ఎం. వేంకటేశ్వర రావు, వి. ఆర్. ఓ. సంఘాల అధ్యక్షులు మద్దాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ అమలాపురం జిల్లా కేంద్రం రామచంద్రపురం నుండి దాదాపు 60 కి.మీ. దూరంలో ఉండడం వల్ల ప్రజలు రోజూ పరిపాలనా పనుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు .ముఖ్యంగా వరదలు, తుఫానులు వంటి విపత్తుల సమయంలో గోదావరి నది పొంగిపోవడం, రహదారులు మునిగిపోవడం, రవాణా ఆగిపోవడం వలన ప్రజలు అత్యవసర అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని,ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆసుపత్రులకు వెళ్ళాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. విద్యార్థులు తమ చదువుల కోసంసతమతమవుతున్నామని అన్నారు..మరోవైపు కాకినాడ జిల్లా కేంద్రం రామచంద్రపురానికి కేవలం 25 కి.మీ. దూరంలో ఉంది. అక్కడే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆధునిక వైద్య సదుపాయాలు, విశ్వవిద్యాలయం, కళాశాలలు, ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రామచంద్రపురం కాకినాడ జిల్లాలో చేర్చితే వైద్యం, విద్య, ఉపాధి, పరిపాలన అన్నీ ప్రజలకు సులభతరం అవుతాయనిగతంలో పునర్విభజనలో రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో చేర్చే ప్రతిపాదన ఉన్నా అమలు కాలేదని చెప్పారు .2022?23లో జరిగిన జిల్లాల విభజనలో రామచంద్రపురాన్ని కోనసీమ జిల్లాలో చేర్చడం ప్రజలపై చేసిన ఘోర అన్యాయం జరిగిందని అన్నారు.ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల పునర్విభజన సబ్ కమిటీలో ఈసారి తప్పకుండా రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని జె.ఏ.సీ గట్టిగా డిమాండ్ చేస్తుందని అన్నారు.ఈసందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గ జేఏసీ ప్రతినిధులు రామచంద్రపురం ఆర్.డీ.ఓ అఖిల ప్రియ వారికి వినతి పత్రం అందజేశారు.అదేవిదంగా రామచంద్రపురం మండల పరిషత్ అధ్యక్షురాలు అంబటి భవాని వారికి వినతి పత్రాలు అందిస్తూ మండల పరిషత్ కౌన్సిల్ లో తీర్మానం చేయాలని కోరారు.చాలా గ్రామాలు నియోజకవర్గానికి అనుకూలంగా తీర్మానం చేశారని, ఇంకా ఉన్న గ్రామాలు కూడా తీర్మానం చేయించాలని ఆమెను కోరారు. ఆమె సానుకూలంగా స్పందించారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురు నేతలు పాల్గొన్నారు .

## తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి వారి ఆలయం పునర్నిర్మాణ పనులు భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడు,జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని





తిరుపతి జిల్లా/తలకోన,ఆగస్టు 18(శ్రీ చక్ర): తలకోన శ్రీ సిద్ధేశ్వర స్వామి వారి ఆలయం పునర్నిర్మాణ పనులలో భాగంగా నేడు భూమి పూజ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్ వెంకటేశ్వర్ టిటిడి బోర్డు చైర్మన్ బి.ఆర్.నాయుడు,చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే పులివర్తి నాని తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...తిరుపతి జిల్లాలోని చంద్రగిరి నియోజకవర్గం లో ఎంతో ప్రసిద్ధి చెందిన తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులు టీటీడీ బోర్డు చైర్మన్ ఆధ్వర్యంలో చేసుకోవడం జరిగిందని అన్నారు. టీటీడీ నిధులతో ఆలయంతో పాటు పుష్కరిణిని కూడా సుమారు రూ.19 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మాణం చేసుకోవడం జరుగుతున్నదని తెలిపారు. వచ్చే మహాశివరాత్రి నాటికి పనులన్నీ పూర్తి అయ్యేలా కార్యచరణ చేసుకోవడం జరిగిందని తెలిపారు.పునర్నిర్మాణానికి సంబంధించిన నిధులన్నీ సమకూర్చిన టిటిడి చైర్మన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు.టీటీడీ బోర్డు చైర్మన్ మాట్లాడుతూ.. ఈ బ్రహ్మాండమైనటువంటి కార్యక్రమానికి విచ్చేసి భూమి పూజ చేయడం జరిగిందని తెలిపారు. తలకోన విశిష్టతను చాలా సార్లు విన్నానని ఈ రోజున ప్రత్యక్షంగా చూస్తూనాన్నని అన్నారు. ఈ ప్రదేశం చాలా చూడ చక్కని కొండ కోనలు కలిగి చూపరులను ఆకట్టుకునేలా ఉందని అన్నారు. ఇక్కడ ఉన్నటువంటి సిద్దేశ్వర స్వామి ఆలయం చాలా పురాతనమైనదని శిథిలావస్థలో ఉందని ఎమ్మెల్యే నాని టిటిడి దృష్టికి తీసుకువచ్చారని అతని విజ్ఞప్తి మేరకు ఈ అంశాన్ని టిటిడి బోర్డులో చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకొని 18 నుండి 19 కోట్ల రూపాయలను ఖర్చుపెట్టి ఇక్కడ ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. అందులో భాగంగా పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు.ఆలయ పునర్నిర్మాణ పనులను మంచి కాంట్రాక్టర్లకి అప్పగించామని సంవత్సరం లోపు పనులు పూర్తి చేయాలని వారికి సూచించామని అన్నారు. ఈ ఆలయాన్ని నిర్మించుకొని అందరి మన్ననలను పొందాలని భక్తులు బాగా రావాలని ఈ ప్రాంతం కూడా బాగా అభివృద్ధి చెందాలని ఆ దేవదేవుని కోరుకుంటున్నానని అన్నారు.ఈ విషయమై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడానని ఆయన వెంటనే సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే నానికి ఏ అవసరమైనా టీటీడీ సమకూర్చాలని ఆదేశించారన్నారు.వారి ఆదేశం మేరకు ఈ రోజున ఇలాంటి బ్రహ్మాండమైనటువంటి కార్యక్రమం జరుగుతున్నదని అందుకు కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందించిన ప్రోత్సాహకం అన్నారు.ఈ ఆలయాన్ని త్వరగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోనికి తీసుకురావాలని అందుకు కావలసిన సహాయ సహకారాలు టీటీడీ తరపున అందిస్తామని తెలిపారు.ఈ ఆలయ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాని,కాంట్రాక్టర్ వారిని కోరుకుంటున్నాను అని అన్నారు.చంద్రగిరి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిద్దేశ్వర స్వామి ఆలయం 15వ శతాబ్దం నాటిది అని ఈ గుడిలో గత పాలకులు ఎందరున్నా కూడా మారుమూల ప్రాంతం అయినందున అభివృద్ధి జరగలేదని అన్నారు. కొంతమంది దాతలు సహకారంతో గోపురాలు నిర్మించారని అయినా కూడా మండలానికి చెందిన ప్రజలు ఇంకా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని 2018 ఎన్నికల సమయంలో విజ్ఞప్తి చేయగా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి చేస్తానని మాటిచ్చానని,అందులో భాగంగా నే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆలయాన్ని అభివృద్ధి చేయవలసినదిగా టీటీడీ వారి దృష్టికి తీసుకెళ్లామని వారు స్పందించి వెంటనే నేడు ఆలయ పునర్నిర్మాణ భూమి పూజ చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.రానున్న మహాశివరాత్రి నాటికి ఆలయ పనులు అన్ని పూర్తి అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో సిద్ధేశ్వర స్వామి ఆలయ ఈ.ఓ రవీంద్ర రాజు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలకు వైద్యులు మార్గదర్శకులు కావాలి: కమిషనర్ ఎన్.మౌర్య




తిరుపతి,ఆగస్టు18(శ్రీచక్ర):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 లో బంగారు కుటుంబాలకు వైద్యులు అందరూ మార్గదర్శకులు కావాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య వైద్యులకు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆప్నా నిర్వహించిన సి.ఎం.ఈ. కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు లేని సమాజాన్ని ఏర్పాటు చేయడం కోసంపి4నుఏర్పాటుచేయడంజరిగిందనిఅన్నారు. వైద్యో నారాయణ హరి అన్న నానుడిని నిజం చేస్తూ వైద్యులు అనేక సేవలు అందిస్తున్నారని అన్నారు. అదే విధంగా వైద్యులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు అండగా నిలిచి ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని, పేదల జీవితాల్లో వెలుగులు నింపాలని అన్నారు. ఇందుకు స్పందించిన వైద్యులు ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆప్నా సంయుక్తంగా ఈ కార్యక్రమంలో భాగస్వాములపై బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ నగర అధ్యక్షులు డాక్టర్ ఆర్.ఆర్.రెడ్డి, ఆప్నా అధ్యక్షులుడాక్టర్ రవి రాజు, డాక్టర్ వెంగమ్మ,డాక్టర్ సుబ్బారావు,డాక్టర్ జనార్దన్, డాక్టర్ ఆశాలత,డాక్టర్ వెంకటేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

## కొత్త బార్ లైసెన్స్ విధానాలు ఖరారు

### రెస్టారెంట్ ఉండాలనే నిబంధన సడలింపు

అమరావతి,ఆగస్ట్18 ):ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త బార్ పాలసీ నిర్ణయం తీసుకుందని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. 840 బార్లు ఏపీ వ్యాప్తంగా ఉన్నాయని.. పదిశాతం కల్లు గీత కులస్థులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. కొత్త వారు ఈ వ్యాపారంలోకి రావడానికి కొన్ని మార్పులు చేశామని వివరించారు. గతంలో బార్ లైసెన్స్ పొందాలంటే రెస్టారెంట్ లైసెన్స్ ముందే ఉండాలని.. ఈసారి ఈ నిబంధన సడలించామని చెప్పుకొచ్చారు. 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు- చేసుకోవచ్చుని సూచించారు. 50 వేల లోపు జనాభా ఉంటే రూ.35 లక్షల లైసెన్స్ ఫీజు ఉంటుందని కమిషనర్ నిశాంత్ కుమార్ వెల్లడించారు. 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉంటే రూ.55 లక్షలు లైసెన్స్ ఫీజు ఉంటు-ందని చెప్పారు. అలాగే 5 లక్షలపైన జనాభా ఉంటే లైసెన్స్ ఫీజ్ రూ. 75 లక్షలు ఉంటుందని ప్రకటించారు. ప్రతి ఏడాది పదిశాతం ఈ ఫీజులు పెంచుతామని వెల్లడించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 అర్జీలు పి జి ఆర్ ఎస్ లో వచ్చిన ఆర్జీలకు మొదటి ప్రాధాన్యతతో పరిష్కారం చూపాలి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్.



తిరుపతి,ఆగస్టు 18 (శ్రీచక్ర):రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పదంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా కలెక్టరేట్ కార్యాలయమునకు మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు వేసవి దృష్ట్యా ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన పిజిఆర్ఎస్ పరిష్కార వేదిక ఆవరణంలో వారు కూర్చోడానికి వీలుగా కుర్చీలు, వైద్య ఆరోగ్య శాఖ వారిచే వైద్య శిబిరం, త్రాగునీటి సౌకర్యం, సూదురా ప్రాంతాల నుండి వచ్చు వారికి టి, కాఫీ ఏర్పాటు చేసి వచ్చిన అర్జీదారులకు అందించి ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారియొక్క సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. జిల్లాలోని డివిజన్, మండల స్థాయి వరకు ఆర్డీవోలు తాసిల్దారులు, ఎంపిడిఓ లు తదితర అధికారుల వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానంతో అర్జీదారుల సమస్యలపై అధికారులతో అక్కడికక్కడే వర్చువల్ విధానంలో మాట్లాడి పరిష్కారం చూపుతున్నారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్ అర్జీలను నిర్దేశిత గడువులోపు పరిష్కరించాలని పెండింగ్ అర్జీలను నిర్ణీత గడువులోగా అర్థవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్ నాయక్,సుధారాణి, రోజ్ మానీడ్ ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదు చేసి అర్జీదారులకు రసీదులు అందించారు.

శ్రీచక్ర
SREECHAKRA TELUGU DAILY
మంగళవారం ఆగష్టు 19 2025

# విద్యానగర్ లో ఎట్టకేలకు గుంతలు పూడ్చివేత...

## ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు..,







కోట ఆగష్టు 18 (శ్రీ చక్ర): గత కొన్ని రోజుల నుండి రోడ్లు గుంతల మయంగా ఉండడంతో ప్రయాణికులు నానారకాల ఇబ్బందులు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే.ఈ మేరకు కోట మండలం విద్యానగర్ గాంధీ బొమ్మ నుండి కాలేజీ రోడ్డు మీదగా వెళ్లే మెయిన్ రోడ్డు అనేక గుంతలు ఉ ండడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా గుంతల్లో వర్షం వచ్చినప్పుడు నీరు నిండడంతో ప్రయాణికులు రోడ్డుపైన పోవాలంటే కష్టంగా ఉండేది.అయితే ఇటీవలన ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.గుంతల మయంగా ఉండే రోడ్డుపై పలు పత్రికల్లో వార్తలు రావడం జరిగింది.దీనితో స్పందించిన ఆర్ అండ్ బి డి ఈ చంద్రశేఖర్ రెడ్డి,కాంట్రాక్టర్లు కలిసి సోమవారం గుంతల మయంగా ఉన్న రోడ్డుపై తాత్కాలికంగా సిమెంటు, కంకర ను కలిపి ట్రిప్పర్ లు సాయంతో ఎట్టకేలకు గుంతలను పూడ్చడం జరిగింది.దీనితో ప్రయాణికులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.అదేవిధంగా విద్యానగర్ స్థానిక వ్యాపారస్థులు వెల్డింగ్ బాబు,జగన్ లు మాట్లాడుతూ అధికారులు స్పందించి తాత్కాళికంగా రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చడం సంతోషదాయకంగా ఉందని,కాకపోతే ఇలాంటి తాత్కాలిక నిర్మాణాలు కాకుండా శాశ్వతంగా ఉండే రోడ్డు నిర్మాణాలను చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.గుంతల మయంగా ఉండే రోడ్డు పై వర్షపు నీరు చేరడంతో ప్రయాణికులు ఎటు వెల్లాలో అనే సందిగ్ధంలో ఉండేవారన్నారు.ప్రస్తుతం తాత్కాలికంగా గుంతలను పూడ్చడంతో ప్రయాణికులుకు కొద్దిపాటి ఉపశమనం కలిగించిందన్నారు.

# శేషాచల అరుదైన జంతు జాతుల పరిరక్షణపై పార్లమెంటులో ప్రస్తావన

## అటవీ భూముల ఆక్రమణలపై ఎంపీ గురుమూర్తి ఆందోళన

తిరుపతి,ఆగష్టు 18(శ్రీచక్ర):శేషాచల జీవవైవిధ్య అభయారణ్యంలో అంతరించిపోతున్న మూషిక జింక, బంగారు బల్లి, దేవాంగ పిల్లి, రంగుల ఉడుత, పసుపు గొంతు పిగిలి పిట్ట వంటి అరుదైన జంతు జాతుల పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో తెలియజేయాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంటులో అడిగారు. అలాగే ఈ జంతువుల సంఖ్య పెరిగేందుకు చేపడుతున్న పరిశోధనలు, పర్యవేక్షణ కార్యక్రమాలు, అభయారణ్య అభివృద్ధిపై వివరాలు కోరారు. వన్యప్రాణుల రక్షణ, వేటగాళ్ల నిరోధం, ప్రజల భాగస్వామ్యం వంటి చర్యల కోసం నిధులు కేటాయించారా అని ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు స్పందించిన కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ సమాధానం ఇచ్చారు. శేషాచల అభయారణ్యంలో పరిరక్షణ చర్యలకు రాష్ట్రాలకు 'వన్యప్రాణుల నివాసాల అభివృద్ధి' పథకం కింద ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు. భారత జంతు శాస్త్ర పరిశోధనా సంస్థ జంతు వైవిధ్యంపై అధ్యయనం చేస్తుండగా, ఐజర్ పక్షుల శబ్దాల ఆధారంగా జీవ ధ్వని శాస్త్ర సాంకేతికత ద్వారా సర్వేలు నిర్వహిస్తున్నదని చెప్పారు. అటవీ భూముల వినియోగం కారణంగా కలిగే నష్టాన్ని తగ్గించేందుకు కాంపా చట్టం కింద నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 2024?25, 2025?26 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తం రూ. 121.63 కోట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అథారిటీకి మంజూరు చేశామని మంత్రి పేర్కొన్నారు.తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలం సింహాచల ఖండ్రిగలో 125 ఎకరాల రక్షిత అటవీ భూమిని టిడిపి ప్రజాప్రతినిధి కొల్లగొట్టే ప్రయత్నాలపై ఎంపి గురుమూర్తి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని బారీ ఎత్తున అటవీ భూమిని సొంతం చేసుకునే ప్రయత్నాలని సంబంధిత అధికారులు అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. అటవీ భూములు రక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తుంటే మరోపక్క టిడిపి నాయకులూ కోట్లాది రూపాయల భూములని కొల్లగొట్టడం దుర్మార్గమన్నారు. రక్షిత అటవీ భూములను కాపాడడం సంబంధిత అధికారుల బాధ్యత అని ఆయన గుర్తు చేసారు. అలా చర్యలు తీసుకొని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు శ్రీకారం చుట్టవలసి వస్తుందని, అవసరమైతే కేంద్ర అటవీ శాఖ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.



# డా. బి. ఆర్. అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్న డా. జూపల్లి తిరుమల రావు : ముఖ్య అతిథిగా డా. కొప్పుల విజయ్ కుమార్




కరీంనగర్, ఆగస్టు 18 (శ్రీచక్ర): సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ మహా నగరం, కింగ్ కోటిలో ఉన్న " తెలంగాణ సరస్వతి పరిషత్ " లో జాతీయ చైర్మన్ డా, కొప్పుల విజయ్ కుమార్ సమక్షంలో ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ అడ్వకేట్, ల్యాండ్ ఎక్స్పర్ట్ , తెలంగాణ అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు యం. సునీల్ కుమార్ (భూమి) , అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ మత్తయ్య , దళితరత్న యస్. రాజు, ప్రముఖ సైకాలజిస్ట్ ఒ హిప్నో థెరపిస్ట్ డా. హిప్నో పద్మ కమలాకర్, తెలంగాణ హైకోర్టు ప్రముఖ అడ్వకేట్ కడారి రమేష్ చేతుల మీదుగా సౌత్ ఇండియా చైర్మన్ డా. జూపల్లి తిరుమల రావు ఎంతో ప్రతీష్టమ్మకమైన డా. బి. ఆర్. అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా తిరుమల రావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కోసం మానవత్వానికి ప్రతిక గా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా అందరికీ మార్గదర్శకంగా ఉంటూన్న డా కొప్పుల విజయ్ కుమార్ అడుగుజాడల్లో నేడు కొన్ని వేలమంది నడవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సమాజం లో రేపటి వెలుగుల కోసం డా. కొప్పుల విజయ్ కుమార్ ఒక అడుగు ముందుకు వేస్తే అయిన వెనుక వేలాది మంది అడుగులు పడుతున్నాయని తెలిపే ఓ గొప్పా మంచి సందేశాత్మకమే ఈ సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ అని కొనియాడారు. అలాంటి సంస్థ నిర్వహణలో పని చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్న నన్ను గుర్తించి ఎంతో గొప్ప డా. బి. ఆర్. అంబేద్కర్ ఎక్సలెన్స్ అవార్డు పొందడం చాలా ఆనందంగా ఉందని తిరుమల రావు అన్నారు. డా.బి. ఆర్. అంబేద్కర్ గారి ఆశయ సాధన కోసం మానవ హక్కుల పరిరక్షణ కోసం మన కొప్పుల విజయ్ కుమార్ గారి అడుగుజాడల్లో ఎంతోమంది నడవడం అభినందనీయం అన్నారు. అనంతరం డా. కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా నేడు హైదరాబాద్ లో వేడుకలను నిర్వహించడం జరిగిందన్నారు. మానవ హక్కులు వాటి పరిరక్షణ మరియు భారత రాజ్యాంగం, విలువలు, ఉపయోగాలు గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా స్నేహిత వ్యవహారించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ చీస్ సెక్రటరీ డా. వై. ఆర్. ఆర్. మోహన్ రావు, ముఖ్య సలహాదారులు మార్గం విజయ్ పటేల్, షేక్ అమీర్ హుస్సేన్, నేషనల్ బోర్డు డైరెక్టర్ కె. రవిబాబు, తెలంగాణా జనరల్ సెక్రటరీ బి. నవీన్ కుమార్, సెక్రటరీ బి. దత్తాద్రి గౌడ్, రాష్ట్ర సమాచార హక్కు చట్ట విభాగం చైర్మన్ డా. సాప పండారి, డైరెక్టర్ మాలేపు నారాయణ, జాయింట్ డైరెక్టర్ బి. సుధాకర్, కె మధుకర్, కె. ఆదినారాయణ, కొప్పుల మనోజ్ కుమార్, పలువురు హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలతో భారీగా నష్టపోయిన రైతులు

## రెండుసార్లు నాటుకున్నా తప్పని కష్టాలు

## ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్న అన్నదాతలు

గుంటూరు,ఆగస్ట్18( రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 1.50 లక్షల ఎకరాల్లో వరి పైర్లకు నష్టం వాటిళ్లగా ఇందులో గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఇప్పటి వరకు అధికారులు ఎటువంటి ఎన్యూమరేషన్ ప్రక్రియ చేపట్టలేదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతి ఏటా పొలాలు ముంపునకు గురికావడం, రైతులు తీవ్ర నష్టాలపాలవడం పరిపాటిగా మారింది.ఈ నేపథ్యంలో రైతులు పంటను కోల్పోయి ఎటూ పాలుపోని స్థితిలో ఉన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఈ ఏడాది అన్నదాతలకు ఆదిలోనే కష్టాలు ప్రారంభమయ్యాయి. వరిసాగు చేసిన రైతులు ఇప్పటి వరకు రెండుసార్లు వెదపద్ధతిలో విత్తనాలు చల్లగా ఒకసారి వర్షాభావం నష్టం వల్ల , రెండో విడత అతి భారీ వర్షాల కారణంగా పెట్టుబడులు దెబ్బతీశాయి. పంట ఎదుగుదల దశలో వైపరీత్యాల వల్ల ఎకరాకు ఒక్కో రైతు రూ.20 వేల వరకు నష్టపోయారు. ఈ నెల 12, 13 తేదీల్లో కురిసిన అతి భారీ వర్షం వల్ల జిల్లాలోని దాదాపు లక్ష ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి.



ఇప్పటికే రెండుసార్లు నష్టపోయిన రైతులు మూడోసారి వెదపద్ధతిలో సాగుకు అవకాశాలు లేవని, ఇప్పుడు నాట్లు వేయాలన్నా నారు అందుబాటులో లేదని వాపోతున్నారు. నారుమడులు పోసి నారు తయారు కావాలన్న కనీసం 30 రోజులు సమయం పడుతుందని ఈ లోగా అదునుదాటిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాలో తొలి పంటగా వరి సాగు, రెండో పంటగా జొన్న, మొక్కజొన్న సాగు చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల పంటను ప్రాథమిక దశలోనే కోల్పోయారు. ప్రధానంగా తెనాలి డివిజన్‌లోని కొల్లిపర, దుగ్గిరాల, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, చేబ్రోలు, పొన్నూరు తదితర మండలాల్లో కురిసిన అధిక వర్షాలకు పైరు నీట మునిగి ఎందుకూ పనికిరాకుండాపోయింది. వరితో పాటు- కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. పసుపు, కంద పంటలు నీట మునిగాయి. గుంటూరు ఛానల్‌కు గండ్లు పడడం, కొండవీటి వాగు ముంపు వల్ల అధిక నష్టం జరిగింది. కాల్వ కట్టల పటిష్టతపై అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్లే అధిక నష్టం జరిగిందని రైతులు వాపోతున్నారు. మూడ్రోజులపాటు- పొలాల్లో రెండు అడుగుల మేరకు నీరు నిల్వ ఉండడం వల్ల పైర్లన్నీ దెబ్బతిన్నాయి. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి. ఎకరాకు రూ.20 వేల వరకు ఒక్కో రైతుకు నష్టం వాటిల్లింది. కాల్వల మరమ్మతులు సక్రమంగా జరగపోవడం, పొలాల్లో నీరు బయటకు పోయే అవకాశాలు లేకపోవడం వల్ల పైర్లు నీట మునిగి పూర్తిగా నష్టం జరిగింది.

# జనతా క్లినిక్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో...,ఈ నెల 21 వ తేది (గురువారం)కోట కు గుండె వ్యాధి నిపుణులు రాక...,



కోట ఆగస్థు 18 (శ్రీచక్ర): కోట,వాకాడు,చిట్టమూరు మండలాల పరిధిలో గుండె వ్యాధికి చెందిన లక్షణాలు ఉన్నవారు 21 వ తేది గురువారం నెల్లూరు నుండి ప్రముఖ గుండె వ్యాధుల నిపుణులు డాక్టర్ జయరామ్ రావడం జరుగుతుంది.కోట మండలంలోని ఎన్సిఆర్ నగర్ లో ఉన్న జనతా క్లినిక్ ఆసుపత్రి కు గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరామ్ వస్తున్నట్లు జనతా క్లినిక్ డాక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు.ఈసీజీ,ఫాస్టింగ్ లిక్విడ్ ప్రొఫైల్ టెస్ట్,ఆర్ బి ఎస్,బి పి,2డి ఎకో, కార్డియాలజీ కన్సల్టేషన్ నిర్వహించే పరీక్షలకు 1500 రూపాయలు ప్యాకేజీతో ఉంటుందన్నారు.ప్రతినెల మూడవ గురువారం ఉ దయం 10 గంటలనుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ జయరామ్ జనతా క్లినిక్ ఆసుపత్రిలో అందుబాటులో ఉంటారని తెలియజేశారు.ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# సెప్టెంబర్ 24 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

## అధికారులతో సమీక్షించిన టిటిడి ఇవో




తిరుమల,ఆగస్ట్18 : తిరుమలలో ఈ ఏడాది వార్షిక బ్రహ్మోత్సవాలు సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 2 వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో టీటీడీ ఈవో జె. శ్యామలారావు బరహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. వివిధ ఏర్పాట్లను సమీక్షించారు. సమీక్షలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ హర్షవర్ధన్ రాజులతో పాటు టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ మురళీకృష్ణలతో కలిసి సోమవారం సాయంత్రం అన్నమయ్య భవనంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 24న బ్రహ్మోత్సవాల తొలిరోజు పట్టు వస్త్రాలను సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# తలకోనలో శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం

## శంకుస్థాపన చేసిన టిటిడి ఛైర్మన్

తిరుపతి,ఆగస్ట్18 : జిల్లాలోని తలకోనలో శ్రీసిద్ధేశ్వరస్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు భూమిపూజ చేశారు. అంతకుముందు ఆయన బాలాలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం ఆలయం, నూతన పుష్కరిణి నిర్మాణానికి ఛైర్మన్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ నాయుడు మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతవరణంలో కొలువైన సిద్ధేశ్వరాలయ జీర్ణోద్ధరణ చేపట్టమన్నారు. ఆలయం శిథిలావస్థలో ఉన్నట్లు- చంద్రగిరి ఎమ్మెల్యే నాని టిటిడి దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.

# వైకాపా పాలనలో నీటిపారుదల నిర్వీర్యం

## అసత్య ప్రచారాలపై మండిపడ్డ నిమ్మల

భీమవరం,ఆగస్ట్18 ):రాష్ట్రంలో ఐదేళ్లపాటు నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేసి, అన్నదాతలకు వైకాపా అన్యాయం చేసిందని మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. మొసలి కన్నీరు కారుస్తూ, కాఫర్ డ్యామ్‌కు గండి పడింది, బెజవాడ మునిగిపోతోంది, తుంగభద్ర గేట్లు- కొట్టుకుపోతాయని అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు లేనిపోని అనుమానాలు, ఆందోళనలు సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వైకాపాది క్షమించరాని నేరమని మంత్రి నిమ్మల అన్నారు. అవాస్తవాలు, అర్ధసత్యాలతో ప్రశాంత ప్రజాజీవనానికి భంగం కలిగించే వాళ్లెవరైనా తీవ్ర నేరగాళ్లతో సమానమేనని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. . రాజకీయ ముసుగులో వైకాపా చేస్తున్న విష ప్రచారంలో వీసమెత్తయినా వాస్తవం లేదు. కూటమి ప్రభుత్వానికి జనాల్లో పెరుగుతున్న ఆదరణ చూసి తట్టు-కోలేకపోతున్నారు. కాఫర్ డ్యామ్ పైనున్న రోడ్డుకి మట్టి జారితే, కాఫర్ డ్యామ్ పడిపోయినట్లు- దుష్ప్రచారం చేస్తున్నారు. అమరావతి మళ్లింపు నీటితో పొన్నూరు మునిగింది అన్నది పూర్తిగా సత్యదూరం. 2019-24 మధ్య కరకట్ట విస్తరణ ప్రణాళికలో భాగంగా ఈ రెగ్యులేటర్ పునర్నిర్మాణం చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ పనిని గత ప్రభుత్వం పూర్తి చేయలేదు. వైకాపా చేసిన పాపాలను వరుసగా మేం ప్రక్షాళన చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాం. అమరావతిపై అక్కసుతోనే కరకట్ట విస్తరణ ప్రాజెక్టు ఆపేశారు. కొండవీటి వాగు వరదను ప్రస్తుతం ఐదారు పంపుల ద్వారా రోజుకు 2000 క్యూసెక్కుల సామర్థంతో ప్రకాశం బ్యారేజీకి




ఎత్తిపోస్తున్నాం. తుంగభద్ర ప్రాజెక్టు 3 గేట్ల మార్పిడి పనులకు రూ.52 కోట్లు- పరిపాలన అనుమతి ఇచ్చి -టె-ండర్ల ద్వారా ఏజెన్సీకి పనులు అప్పగించాము. భద్రతా చర్యల్లో భాగంగా 80 తీసుకుంది. ఆయకట్టు- భూములకు నీటి సరఫరా విషయంలో ఖరీఫ్‌కు ఎలాంటి అంతరాయం ఉండదు. తుంగభద్ర ప్రాజెక్టుకు ప్రమాదం వంటి వార్తలు పూర్తిగా నిరాధారం. ప్రకాశం బ్యారేజీ 67వ గేటు- విరిగింది అనేది వాస్తవం కాదు. గేటుకి సంబంధించిన రోలర్‌లో చిన్న సాంకేతిక సమస్య వల్ల గేటు ఆపరేషన్ నిలిపివేశామని నిమ్మల వివరించారు.

# స్పోర్ట్స్ న్యూస్

## హర్యానా స్టీలర్స్ కెప్టెన్‌గా సూపర్ డిఫెండర్.. డిప్యూటీగా అతడే..!

ప్రో కబడ్డీ లీగ్ పదకొండో సీజన్ ఛాంపియన్ హర్యానా స్టీలర్స్ మరో టైటిల్ కోసం పక్కాగా సన్నద్ధమవుతోంది. 12వ సీజన్‌లోనూ ట్రోఫీతో చరిత్ర సృష్టించాలనుకుంటున్న హర్యానా ఫ్రాంచైజీ సూపర్ డిఫెండర్ జైదీప్ దహియా (ఏజీతిటవవజూ ఆజీప్త్రతిఏజీ)కు మరోసారి కెప్టెన్సీ అప్పగించింది. తొలిసారి తమ జట్టు పీకేఎల్ విజేతగా అవతరించడంలో కీలక పాత్ర పోషించిన దహియాకు.. రాహుల్ సేథ్‌పాల్ వైస్ కెప్టెన్‌గా ఉంటాడని యాజమాన్యం తెలిపింది. మ్యాచ్ సమయంలో వేగంగా, తెలివిగా నిర్ణయాలు తీసుకోగల నైపుణ్యం ఉన్నందున ఈ ఇద్దరిని ఎంపకి చేశామని కోచ్ మన్‌ప్రీత్ సింగ్ వెల్లడించాడు.'కబడ్డీ ఆటలో ఐకమత్యంతో పాటు వేగంగా నిర్ణయం తీసుకునే నేర్పు ఉండాలి. జైదీప్, రాహుల్‌కు ఈ రెండు నైపుణ్యాలు ఉన్నాయి. ఇద్దరూ మ్యాట్ మీద ప్రత్యర్థి ఎత్తులను చిత్తు చేయడంలో ఇద్దరు ది బెస్ట్. క్రమశిక్షణ, నిలకడ.. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గత సీజన్‌లో మా జట్టు ఛాంపియన్‌గా నిలవడంలో జైదీప్, రాహుల్ కీలక పాత్ర పోషించారు. ఈ ఏడాది కూడా మేము టైటిల్‌పై కన్నేశాం' అని కోచ్ మన్‌ప్రత్ సింగ్ అన్నాడు.పీకేఎల్ స్టార్ అయిన జైదీప్ దహియా హర్యానా జట్టుకు కొన్నాళ్లుగా ఆడుతున్నాడు. 87 మ్యాచుల్లో 231 రైడ్ పాయింట్లు సాధించిన దహియా.. డిఫెన్స్‌లోనూ సత్తా చాటి 227 పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. రాహుల్ కూడా హర్యానా బెస్ట్ ప్లేయర్. గత సీజన్‌లో అతడు 24 మ్యాచుల్లో 73 టాకిల్ పాయింట్లతో రాణించాడు.రైడర్స్ : నవీన్ కుమార్, శివం పతారే, వినయ్ తెవాటియా, షాహన్ షా మహమ్మద్, ఘనశ్యామ్ రొకా మగర్, మయాంక్ సైనీ, జయసూర్య ఎన్ఎస్, విశాల్ తటే, వికాస్ జాదవ్. ఢిఫెండర్లు : జైదీప్ దహియా, రాహుల్ సేథ్‌పల్, రాహుల్ అహ్రి, రితికా గుర్జర్, జుబైర్ మాలిక్, హర్దీప్ కండోలా, అంకిత్ ధుల్, సచిన్ దహియా, ఎన్ మణికందన్. ఆల్‌రౌండర్లు : అశిష్ నర్వాల్, సహిల్ నర్వాల్.ప్రో కబడ్డీ లీగ్-11వ సీజన్ టైటిల్‌ను హర్యానా స్టీలర్స్ తొలిసారి దక్కించుకుంది. సీజన్ ఆరంభం నుంచి టేబుల్ టాపర్‌గా ఉంటూ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆ జట్టు.. టైటిల్ పోరులో 32-23తో పాట్నా పైరేట్స్‌ను మట్టికరిపించింది. గతేడాది ఫైనల్‌లో పూణెరి పల్టన్ చేతిలో ఓడి రన్నరప్‌గా నిలిచిన హర్యానా ఈసారి మాత్రం పట్టు విడవకుండా టోర్నీ ఆసాంతం అదరగొట్టి తమ కప్ కలను సాకారం చేసుకుంది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 15-12తో ఆధిక్యంలో ఉన్న హర్యానా.. సెకండాఫ్‌లో మరింత జోరు పెంచింది. హర్యానా తరఫున రైడర్ శివమ్ పటారె 9 పాయింట్లతో సత్తా చాటగా ఆల్‌రౌండర్ షాద్లోయ్ (7), వినయ్ (6) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.




## ఒక్క గోల్ చేయలేక.. మైదానంలోనే వలవల ఏడ్చిన ఫుట్‌బాల్ స్టార్..!

ఔవఎజీతీ : హాకీ, క్రికెట్, ఫుట్‌బాల్.. మైదానంలో ఆడే ఆట ఏదైనా ఓటమిని తట్టుకోలేరు కొందరు. అదే ఘోర పరాజయం ఎదురైనప్పుడు ఎంత బాధను ఎంతగా దిగమింగాలనుకున్నా సాధ్యం కాదు. ఆ క్షణంలో ఉబికివస్తున్న కన్నీళ్లను నియంత్రించలేక వలవల ఏడుస్తారు. తాజాగా ఫుట్‌బల్ స్టార్ నెయ్‌మర్ సైతం పిల్లాడిలా కంటతడి పెట్టుకున్నాడు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో వాస్కోడిగామా టీమ్ చేతిలో బ్రెజిల్ ఫార్వర్డ్ సారథ్యం వహిస్తున్న శాంటోస్ చిత్తుగా మట్టికరిచింది. అంతే.. ఓటమిని తట్టుకోలేక నెమ్‌మర్ కన్నీళ్లు పెట్టుకున్నాడు.ఆగస్టు 17 ఆదివారం ఏకపక్షంగా సాగిన పోరులో వాస్కోడిగామా టీమ్‌కు గోల్స్ వర్షం కురిపించింది. శాంటోస్ జట్టు ఆటగాళ్లు ఒక్క గోల్ కూడా చేయలేకపోయారు. వాస్కోడిగామా జట్టులోని ఫిలీప్పే కౌటిన్హో, లుకాస్ పిటొన్, డేవిడ్ ఫొన్సెకా, రయాన్, డానిలో నెవెస్ తలా ఒక గోల్‌తో జట్టుకు భారీ ఆధిక్యాన్ని అందించారు. మ్యాచ్‌లో ఒక్క గోల్ కూడా కొట్టలేక 0-6తో శాంటోస్ ఓడిపోయింది. దాంతో.. ఆ బాధను తట్టుకోలేకపోయాడు నెయ్‌మర్.బ్రెజిల్ తరఫున ఎన్నో అద్భుతమైన గోల్స్ చేసిన అతడు 'మరీ ఇంత దారుణంగా ఓడిపోయాం' అని మైదానంలోనే కన్నీటిపర్యంతమయ్యాడు. గ్రౌండ్‌లోనే కూలబడి చేతులతో కన్నీ?ళ్లు తుడచుకుంటున్న అతడిని సహచరులు, ప్రత్యర్థి జట్టు ఆటగాళ్లు హత్తుకొని ఓదార్చారు. మ్యాచ్ అనంతరం జట్టు ఓటమిపై నెయ్‌మర్ తీవ్రంగా స్పందించాడు.'మైదానంలో మా ప్రవర్తనను మీరు దేశ ప్రజలకు అర్థమయ్యేలా చెప్పండి. ఈ రోజు మా ప్రదర్శన చాలా ఘోరంగా ఉంది. శాంటోస్ జెర్సీతో ఇంత చెత్తగా ఆడడం అవమానంగా అనిపిస్తోంది. ఆటగాళ్లందరూ ఇంటికి వెళ్లాక మీ ఆటను విశ్లేషించుకోండి. మెరుగయ్యేందుకు ఏం చేయాలో ఆలోచించండి' అని జట్టు సభ్యులను నెయ్‌మర్ సుతిమెత్తగా హెచ్చరించాడు. ఆగస్టు 24న శాంటోస్ జట్టు బహియా టీమ్‌ను ఢీకొట్టనుంది.





## అంతకంటే మొనగాడు లేడు.. అతడిని తప్పకుండా ఆడించాలి..: ఆకాశ్

ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఈ ఏడాది టోర్నమెంట్‌కు భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉండగా.. కొన్ని కారణాల వల్ల యుఎఇలో మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే ఈ మెగా టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును బిసిసిఐ త్వరలో ప్రకటించే అవకాశం ఉంది. అయితే ఈ జట్టులో ఎవరికి చోటు దక్కుతుందా? అనే ఊహాగానాలు చాలా వస్తున్నాయి. అయితే డాషింగ్ ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌కు జట్టులో చోటు దక్కే అవకాశం లేదనే మాట బలంగా వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్‌ను కచ్చితంగా జట్టులోకి తీసుకోవాలని మాజీ ఆటగాడు ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు."శ్రేయస్ అయ్యర్ గురించి తప్పకుండా చర్చ జరగాలి. ఛాంపియన్స్ ట్రోఫీ-2025లో మధ్య ఓవర్లలో శ్రేయస్ కంటే గొప్పగా ఆడిన మొనగాడు లేడు. ప్రత్యర్థిని అతడు ఒత్తిడిలోకి నెడతాడు.. అవసరమైన సమయంలో బౌండరీలు సాధిస్తాడు. తన తోటి బ్యాటర్‌పై ఒత్తిడి లేకుండా తానే అంతా చూసుకుంటాడు. గత ఐపిఎల్‌లో శ్రేయస్ అదరగొట్టాడు. భారీ అంచనాలు, ఒత్తిళ్ల నడుమ.. తన కెరీర్‌లోనే అత్యుత్తమంగా ఆడాడు.చాలా మంది ఆటగాళ్లను ఐపిఎల్ ప్రదర్శనల ద్వారానే ఎంపిక చేశారు. వరుణ్ చక్రవర్తి. రింకూ సింగ్, హర్షిత్ రాణా, అభిషేక్ శర్మ, సంజూ శాంసన్.. ఇలా అందరూ ఐపిఎల్ ప్రదర్శనల ద్వారానే జట్టులోకి వచ్చారు కదా! అలా చేస్తూ.. శ్రేయస్ అయ్యర్ కూడా ఆసియా కప్‌కు అర్హుడే. ప్లేయింగ్ 11 నుంచి తిలక్ వర్మను తప్పిస్తే.. శ్రేయస్ మూడు లేదంటే నాలుగో స్థానంలో సరిగ్గా సరిపోతాడు. అలా కాకుండా ఐదో స్థానంలో అతడిని ఆడిస్తే.. అది టి-20ల్లో లోయర్ ఆర్డర్ లాంటిదే" అని ఆకాశ్ పేర్కొన్నారు.




## వరల్డ్ కప్ బరిలో అమెరికా, టాంజానియా.. 16 జట్లలో ఫేవరెట్ ఎవరంటే..!



పురుషుల అండర్ -19 వరల్డ్ కప్ పోటీలకు అమెరికా అర్హత సాధించింది. క్వాలిఫయర్స్‌లో అద్భుత ప్రదర్శనతో ప్రపంచ కప్ బెర్తు సాధించింది యూఎస్‌ఏ. దాంతో, మెగా టోర్నీ బరిలో నిలిచిన జట్ల సంఖ్య 16కు చేరింది. రెండేళ్ల క్రితం టాప్-10లో నిలిచిన జట్లతో పాటు ఆతిథ్య జింబాబ్వే అర్హత సాధించింది. మిగతా ఆరు స్థానాలను క్వాలిఫయర్స్ విజేతలు సొంతం చేసుకున్నాయి. జింబాబ్వే, నమీబియా వేదికగా వచ్చే ఏడాది అండర్ -19 ప్రపంచ కప్ జరుగనుంది.గత ఎడిషన్ ఫైనల్ చేరిన భారత్, ఆస్ట్రేలియాతో పాటు ఇంగ్లండ్, ఐర్లాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించాయి. ఆసియా క్వాలిఫయర్‌లో మెరుగైన రన్‌రేటు కారణంగా అఫ్గనిస్థాన్, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో నమీబియాను ఓడించిన టాంజానియా బెర్తు దక్కించుకున్నాయి.రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ టోర్నీలో ఒక్కో దాంట్లో నాలుగు చొప్పున నాలుగు గ్రూప్‌లు ఉంటాయి. ఈస్ట్ ఆసియా ఫసిఫిక్ క్వాలిఫయర్‌లో ఆడిన జపాన్, స్కాంట్లండ్ క్వాలిఫై అయ్యాయి. అమెరికా క్వాలిఫయ్సర్స్‌లో కెనడా, బెర్మూడా, అర్జెంటీనాకు షాకిచ్చిన అమెరికా వరల్డ్ కప్ రేసులోకి దూసుకొచ్చింది.వరల్డ్ కప్ బరిలో ఉన్న జట్లు ఇవే.. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్, శ్రీలంక, ఐర్లాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే, అఫ్గనిస్థాన్, జపాన్, స్కాట్లాండ్, టాంజానియా, యూఎస్‌ఏ.

## ఛాంపియన్ల మధ్య ఐదో టైటిల్ పోరు.. ఫలితంపై ఉత్కంఠ..!



పురుషుల టెన్నిస్‌ను ఏలుతున్న కార్లోస్ అల్కరాజ్ జన్నిక్ సిన్నర్‌లు మరో పోరుకు సిద్ధమవుతున్నారు. ఈమధ్యే వింబుల్డన్ ఫైనల్లో హోరాహోరీగా తలపడిన ఇరువురు ఇప్పుడు సిన్సినాటి ఓపెన్ ఫైనల్లో తాడోపేడో తేల్చుకోనున్నారు. సిన్నర్, అల్కరాజ్ టైటిల్ పోరులో తలపడడం ఇది ఐదోసారి. ఈ ఏడాది ఇద్దరికి ఇది నాలుగో ఫైనల్ కావడం విశేషం.ఇటాలియన్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్‌లో ఓ నువ్వానేనా అన్నట్టు ఢీకొన్న ఈ యువకెరటాలు ఇప్పుడు మరో రసవత్తర పోరాటంతో అభిమానులను అలరించనున్నారు. సోమవారం ఆగస్టు 18న ఫైనల్ సిన్సినాటి ఫైనల్ జరుగనుంది. ఈమధ్య మూడు ఫైనల్లో సిన్నర్, అల్కరాజ్ ఎదురుపడ్డారు. ఇందులో స్పెయిన్ బుల్ రెండు విజయాలతో ఇటలీ కెరటంపై పైచేయి సాధించాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో సిన్నర్‌కు షాకిచ్చి అల్కరాజ్ ఛాంపియన్‌గా నిలిచాడు.అయితే.. వింబుల్డన్ ఫైనల్లో ఐదు గంటలు కొదమసింహాల్లా పోరాడారిద్దరూ. చివరకు సిన్నర్ విజేతగా అవతరించాడు. ఏటీపీ మాస్టర్స్ కలిపితే ఓవరాల్‌గా 13 మ్యాచుల్లో 8-5తో అల్కరాజ్ ఆధిపత్యం చెలాయించాడు. అలా అనీ టాప్ సీడ్ సిన్నర్‌ను తక్కువ అంచనా వేయడానికి లేదు. ఇద్దరూ తేలికగా ఓటమికి తలొగ్గే రకం కాదు. దాంతో, సిన్సినాటి ఓపెన్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది.

## గాయంతో ఇషాన్ కిషన్ ఔట్.. దేశవాళీ హీరోకు కెప్టెన్సీ..!


ఏడాది కాలంగా జట్టుకు దూరమైన ఇషాన్ కిషన్ ఆసియా కప్ ముందే గాయపడ్డాడు. దేశవాళీ క్రికెట్‌లో అదరగొట్టి.. పునరాగమనం చేస్తాడనుకుంటే.. దులీఫ్ ట్రోఫీ నుంచి అనూహ్యంగా దూరమయ్యాడు. ఈస్ట్ జోన్ సారథిగా ఎంపికైన ఈ చిచ్చరపిడుగు మెగా టోర్నీలో ఆడడం లేదని ధ్రువీకరించిన ఒడిశా క్రికెట్ సంఘం అతడి స్థానంలో మరో ఆటగాడిని తీసుకుంది. ఇషాన్ బదులు 27 ఏళ్ల ఆశీర్వాద్ స్వెయిన్‌ను స్క్వాడ్‌లోకి రాగా.. వైస్ కెప్టెన్‌గా ఉన్న అభిమన్యు ఈశ్వరన్ జట్టును నడిపిస్తాడని ఈస్ట్ జోన్ సెలెక్టర్లు తెలిపారు.'ఇషాన్ కిషన్ గాయంతో దులీప్ ట్రోఫీకి దూరమయ్యాడు. అతడి స్థానంలో ఒడిశా వికెట్ కీపర్, బ్యాటర్ ఆశీర్వాద్ స్వెయిన్ ఈస్ట్ జోన్ స్క్వాడ్‌లోకి తీసుకున్నాం. సందీప్ పట్నాయక్‌కు అతడు బ్యాకప్‌గా ఉంటాడు. యువకెరటం స్వస్తిక్ సమాల్‌ను స్టాండ్ బైగా ఎంపిక చేశాం' అని ఒడిశా క్రికెట్ సంఘం సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది. దులీప్ ట్రోఫీలో ఆగస్టు 28న నార్త్ జోన్‌తో ఈస్ట్ జోన్ తలపడనుంది.ఐపీఎల్ 18వ సీజన్‌లో సెంచరీతో మెరిసిన ఇషాన్ జాతీయ జట్టులో చోటు కోసం నిరీక్షిస్తున్నాడు. అండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ మాంచెస్టర్ టెస్టులో పంత్ గాయపడిన తర్వాత అతడికి పిలుపు వస్తుందని ఊహించారంతా. కానీ, ఇషాన్ మాత్రం అయిష్టం చూపించడంతో తమిళనాడుకు చెందిన ఎన్ జగదీశన్‌ను ఎంపిక చేశారు సెలెక్టర్లు.




ఈస్ట్ జోన్ స్క్వాడ్ : అభిమన్యు ఈశ్వరన్(కెప్టెన్), సందీప్ పట్నాయక్, విరాట్ సింగ్, దినేశ్ దాస్, శ్రీదామ్ పాల్, శరన్‌దీప్ సింగ్, కుమార్ కుషగ్ర, రియాన్ పరాగ్, ఉత్కర్ష్ సింగ్, మనీషి, సూరజ్ సింధు జైస్వాల్, ముకేశ్ కుమార్, మహ్మద్ షమీ, ఆశీర్వాద్ స్వెయిన్.


స్టాండ్ బై ప్లేయర్లు : ముఖ్తర్ హుస్సేన్, వైభవ్ సూర్యవంశీ, స్వస్తిక్ సమాల్, సుదీప్ కుమార్, రాహుల్ సింగ్.

# పెసల మొలకలతో ఇలా చేస్తే.. రెట్టింపు శక్తి, ఎన్నో లాభాలు...!!




పతిరోజు పెసలును నానబెట్టుకుని మొలకలు చేసుకుని తినడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పెసరలో మెగ్నీషియం, పొటాషియం స్థాయులు ఎక్కువగా ఉంటాయి. పెసర పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అమైనో ఆమ్లాలు, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని న్యూట్రీషియన్లు చెబుతున్నారు. అంతేకాదు వీటిలో ప్రోటీయోలైటిక్ ఎంజైమ్స్ కూడా ఉంటాయి. అలసటను పోగొట్టేందుకు, మెరుగైన నిద్రకు పెసరపప్పు ఎంతగానో సహాయపడుతుంది. ఉదయం వేళ బ్రేక్ ఫాస్ట్ వేళ వీటిని తీసుకుంటే రెట్టింపు శక్తి ఇవ్వటంతో పాటుగా ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందుతాయి.మొలకల్లో విటమిన్‌లు, మినరల్‌లు, ఫైబర్, మరియు ప్రోటీన్‌లు అధికంగా ఉంటాయి. వీటల్లో ముఖ్యంగా విటమిన్ అ, ః-కాంప్లెక్స్, మరియు విటమిన్ ఇ లాంటి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి. మొలకలను తినడం ద్వారా జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. మొలకలు తేలికగా జీర్ణం అయ్యే ఆహారం కావడంతో, ఇబ్బంది లేకుండా జీర్ణమవుతాయి. మొలకల్లో ఉండే ఫైబర్ జీర్ణశక్తిని పెంచి, మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది. మొలకల్లో ప్రోటీన్ చాలా శాతం లభిస్తుంది, ప్రత్యేకంగా పప్పులు, శెనగలు వంటి వాటి మొలకల్లో అధికంగా ప్రోటీన్ ఉంటుంది. ఇది మాంసాహారాన్ని తగ్గించి, ప్రోటీన్ అవసరాలను తేలికగా తీర్చగలగడం వలన, ఇది శాకాహారులకు మంచి ఆహారంగా ఉపయోగపడుతుంది. మొలకలు తక్కువ క్యాలరీలు కలిగి ఉంటాయి, కానీ పోషకాలు ఎక్కువ.మొలకల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మొలకల్లో ఉండే విటమిన్ అ శరీరాన్ని వింత రోగాల నుంచి రక్షించడంలో సహాయపడుతుంది. ఇవి శరీరంలో ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గించి, ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మొలకల్లో ఫైబర్ మరియు పుట్టుమటుకులాంటి పోషకాలు అధికంగా ఉండటంతో, ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. ఫలితంగా, హృదయ సంబంధిత వ్యాధులను నివారించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా, ఈ మొలకలు రక్తనాళాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మరియు రక్తపోటు నియంత్రణలో సహాయపడతాయి. మొలకల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ కారణంగా, మొలకలు మధుమేహం ఉన్న వారికి చాలా మంచివి. వీటిని తరచుగా తీసుకోవడం ద్వారా బ్లడ్ షుగర్ లెవెల్స్ క్రమంలో ఉంటాయి.

# నానబెట్టిన బాదం తింటే ఈ సమస్యలకు మంచి రిలీఫ్..!!



బాదం ఆరోగ్య పరంగా ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. బాదంలో ఉండే పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. శక్తిని అందిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ ను నిరోధిస్తుంది. బాదంలో అనేక రకాలైన విటమిన్లు లభ్యం అవుతాయి. నానబెట్టిన బాదం తినటం ద్వారా మధుమేహం నియంత్రణతో పాటుగా రక్తపోటును అదుపులో ఉంచుతుంది. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధులకు ఉపశమనం కలుగుతుంది. అయితే, బాదం పరిమితంగానే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. బాదం ఆరోగ్య పరంగా మేలు చేస్తుంది. బాదం ఎప్పుడూ నానబెట్టిన తర్వాత, ఖాళీ కడుపుతో తినాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నోటి లోపల చాలా ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా ఉంటుంది. ఇది బాదంను జీర్ణం చేయడంలో, ప్రయోజనాన్ని పొందడంలో సహాయపడుతుంది. ఒక రోజులో 20 నుండి 30 గ్రాముల బాదం గింజలను తినవచ్చునని చెబుతున్నారు. బాదం పప్పు తినడం వల్ల ఫైబర్, ప్రోటీన్, విటమిన్ ఇ, ఆరోగ్యకరమైన కొవ్వు, మెగ్నీషియం, మాంగనీస్, విటమిన్ ః2, భాస్వరం, రాగి లభిస్తాయి. ఇవి మెదడు, కండరాలు, కడుపు మరియు గుండెకు ప్రయోజనకరంగా ఉంటాయి. బాదంలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడానికి పనిచేస్తాయి. ఈ ఒత్తిడి కణాలను దెబ్బతీస్తుంది. దాదాపు అన్ని దీర్ఘకాలిక వ్యాధుల అభివృద్ధిలో పాత్ర పోషిస్తుంది. ఇది కొవ్వులో కరిగే విటమిన్, ఇది జుట్టు, చర్మం, కండరాలకు చాలా అవసరం. కణాల నిర్మాణానికి ఇది చాలా ముఖ్యమైనది. మధుమేహం నియంత్రించడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఇందులో ఫైబర్ ఉంటుంది. రక్తంలో షుగర్ లెవల్స్ ఆకస్మికంగా పెరగకుండా నిరోధిస్తుంది. రక్తపోటును నియంత్రించే మెగ్నీషియం సైతం బాదంలో పుష్కలంగా ఉంటుంది. ఒఆఓ కొలెస్ట్రాల్ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కానీ బాదం కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. అయితే, వైద్యులు నిర్దేశించిన మొత్తంలో నాన బెట్టిన బాదం తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.




# ఇది ఒక్కటి తింటే బరువుకు, డయాబెటిస్ కు చెక్,ఇంకా మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు!

మనం నిత్యం వంటలో ఉపయోగించే ఒక పదార్థం మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. అయితే దాని యొక్క ప్రయోజనాలను గురించి తెలుసుకుని దానిని వినియోగించుకోవడం అవసరం. సాధారణంగా మనం వంటలలో రుచికోసం ఉపయోగించే జీలకర్ర ఒక సుగంధ ద్రవ్యం. ఇది మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను ఇస్తుంది. జీలకర్రలో ఫుల్ పోషకాలు జీలకర్రలో విటమిన్ ఏ, విటమిన్ ఈ, విటమిన్ సి, విటమిన్ కే మరియు విటమిన్ ఎ6 ఉంటాయి. అంతేకాదు ఐరన్, మెగ్నీషియం, కాల్షియం తదితర పోషకాలు ఉంటాయి. జీలకర్రను మనం నిత్యం ఆహారంలో భాగంగా తీసుకుంటే అనేక ప్రయోజనాలు కలుగుతాయి. జీలకర్రలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన ఆరోగ్య రక్షణకు కీలకంగా పనిచేస్తాయి . జీలకర్ర మన జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీలకర్రతో డయాబెటిస్ కు చెక్ జీలకర్ర ఫుడ్ ఇన్ఫెక్షన్ ను తగ్గిస్తుంది. జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. గట్ హెల్త్ కు దోహదం చేస్తుంది.



జీలకర్ర మధుమేహం యొక్క దీర్ఘకాలిక ప్రభావాన్ని అధిగమించటానికి దోహదం చేస్తుంది. జీలకర్రను నిత్యం ఆహారంలో భాగంగా చేసుకుంటే డయాబెటిస్ ను కంట్రోల్ చేయవచ్చు. జీలకర్ర ఇన్సులిన్ స్థాయిలను మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది. జీలకర్రతో రక్తంలో ఎల్డిఎల్ కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మన శరీరంలోని ట్రై గ్లిజరైడ్స్ తగ్గించడానికి కూడా జీలకర్ర దోహదం చేస్తుంది. జీలకర్రతో ఈ ప్రయోజనాలు కూడా జీలకర్ర మన శరీరంలో నొప్పులు, వాపులు తగ్గించడానికి ఉపయోగపడుతుంది. నిత్యం క్రమ పద్ధతిలో జీలకర్రను తీసుకుంటే ఇది మన కేంద్ర నాడీ వ్యవస్థ పైన కూడా ప్రభావాన్ని చూపించి మన జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. ప్రస్తుతం మనలో చాలామంది ఐరన్ డెఫిషియన్సీ తో బాధపడుతున్నారు. అటువంటివారు ప్రతిరోజు ఒక టీ స్పూన్ జీలకర్రను ఆహారంలో తీసుకుంటే ఐరన్ లోపాన్ని నివారించడానికి వీలవుతుంది. జీలకర్రతో బరువు తగ్గే అవకాశం జీలకర్రను ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది క్యాన్సర్ నియంత్రణకు దోహదం చేస్తుంది. డయేరియాతో బాధపడే వారికి జీలకర్ర ఉపయోగించడం వల్ల రిలీఫ్ వస్తుంది. జీలకర్రతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్ తగ్గటమే కాకుండా బరువు తగ్గటానికి దోహదం చేస్తుంది. జీలకర్ర యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గా పని చేస్తుంది. ఇన్ని ప్రయోజనాలు ఉన్న జీలకర్రను మన ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిది.

# ఆగస్ట్ 26 నుండి వీరు నక్కతోక తొక్కుతున్నారు.. రెడీ అవ్వండి!



నిర్దిష్ట రాశులలో నిర్దిష్ట గ్రహాలు నిర్దిష్ట కాలమానం ప్రకారం సంచారం చేస్తూ ఉంటాయి. గ్రహాలు సంచారం చేస్తున్నప్పుడు కొన్ని శుభ యోగాలను, కొన్ని అశుభ యోగాలను ఏర్పరుస్తాయి. అన్ని రాశులపైన ప్రభావాన్ని చూపిస్తాయి. కొన్ని యోగాలు కొన్ని రాశుల వారికి శుభ ఫలితాలను ఇస్తే, మరికొన్ని రాశుల వారికి అశుభ ఫలితాలను ఇస్తాయి. ఆగస్టు 26వ తేదీన ఒక అద్భుతమైన యోగం ఏర్పడబోతోంది. నవ పంచమ రాజయోగం ప్రస్తుతం మీనరాశిలో సంచరిస్తున్న శని, మిథున రాశిలో సంచరిస్తున్న శుక్రుడు 120 డిగ్రీల కోణంలో ఉండడం వల్ల శని శుక్రులు నవ పంచమ స్థానాలలో ఉండడం వల్ల నవ పంచమ రాజయోగం ఏర్పడుతుంది. ఈ రాజయోగం కారణంగా అదృష్టవంతులు అయ్యే రాశులు ఏమిటో మనం ప్రస్తుతం తెలుసుకుందాం. మేషరాశి నవ పంచమ రాజయోగం మేష రాశి జాతకులకు అదృష్టాన్ని ఇస్తుంది. మేషరాశి జాతకులు ఈ సమయంలో ఆర్థికపరంగా బాగా లాభాలను చూస్తారు. ఈ సమయంలో వీరు నూతన భాగస్వామ్యంతో వ్యాపారాలను మరింత విస్తరిస్తారు. కుటుంబ సభ్యులతో ఏదైనా ట్రిప్ లకు వెళతారు. కొత్త కాంట్రాక్టులు చేతికి వస్తాయి. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థికపరంగా ను కలిసి వస్తుంది. సింహరాశి శని శుక్రుల కారణంగా ఏర్పడే నవ పంచమ రాజయోగం సింహరాశి జాతకులకు ఆర్థిక ప్రయోజనాలను తెస్తుంది. ఈ సమయంలో సింహ రాశి జాతకులు సంతోషంగా జీవిస్తారు. పరీక్షలకు సిద్ధమవుతున్న వారు శుభవార్తలు వింటారు. వివాహాలు కానీ వారికి వివాహ యోగం ఉంది. ప్రేమ జీవితం సంతోషంగా సాగుతుంది. కష్టానికి తగిన ఫలితం ఉంటుంది. ఇది సింహ రాశి వారికి కలిసి వచ్చే కాలం.! మీన రాశి మీనరాశి జాతకులకు నవ పంచమ రాజయోగం కారణంగా సానుకూల ఫలితాలు వస్తాయి. మీన రాశి వారికి ఈ సమయం బాగుంటుంది. మిమ్మల్ని ఇష్టపడే వారు మీకు సహాయం చేసే పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో మీన రాశి వారి విజయాలను అందుకుంటారు. కొత్త విషయాలను నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు ఇది మంచి సమయం. .విదేశీ ప్రయాణాలు చేసే అవకాశం ఉంది.


# చిన్న చిన్నగా ఉన్నాయని నిర్లక్ష్యం వద్దు... పెద్ద ఆరోగ్యాన్నిస్తాయి

ఆవాలు మన వంటకాల్లో, ముఖ్యంగా పోపులో ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఇవి కేవలం రుచిని, వాసనను పెంచడమే కాకుండా అనేక పోషకాలు, ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. ఆవాలు తినడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది. ఒమేగా-3, ఒమేగా-6 ఫ్యాటీ యాసిడ్స్ కు మంచి వనరులు. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీఆక్సిడెంట్స్, టోకోఫెరోల్ రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. అధిక రక్తపోటు ఉన్నవారికి కూడా దీనివల్ల మేలు కలుగుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉంటుంది ఆవాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచి, మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపరచడం ద్వారా ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. సెలీనియం, ఐరన్, విటమిన్ సి వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. సెలీనియం రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది జలుబు, దగ్గు వంటి సాధారణ ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తుంది. కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, సెలీనియం వంటి ఖనిజాలు ఉంటాయి. “ ఆ హీరోతో రొమాన్స్ చేయడానికి ఏదైనా త్యాగం చేస్తా - పూజా హెగ్డే” కీళ్ల నొప్పులు తగ్గుతాయి ఆవాలలో ఉండే విటమిన్ ఎ, సి, కె, అలాగే యాంటీ ఆక్సిడెంట్లు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి చర్మాన్ని తేమగా ఉంచి, మొటిమలను తగ్గిస్తాయి.ఆవనూనెను జుట్టుకు మసాజ్ చేయడం వల్ల జుట్టు కుదుళ్లు బలపడి, జుట్టు రాలడం తగ్గి, ఒత్తుగా పెరుగుతుంది. ఇది చుండ్రును కూడా నివారిస్తుంది. గ్లూకోసినోలేట్స్, మైరోసినేస్ వంటి సమ్మేళనాలు వీటిల్లో ఉంటాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం, ఈ సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆవాల పొడిని వేడి నీళ్లలో కలిపి కాళ్లకు మసాజ్ చేయడం వల్ల పాదాల నొప్పులు తగ్గుతాయి. కీళ్ల నొప్పులు, కండరాల నొప్పుల నుండి ఉపశమనం పొందడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి.



శ్రీచక్ర

మంగళవారం ఆగష్టు 19 2025





# నాని రచ్చకి సీట్లు చిరిగిపోయేలా..!



న్యాచురల్ స్టార్ నాని దసరా తర్వాత మళ్లీ శ్రీకాంత్ ఓదెల తోనే సినిమా చేస్తున్నాడు. ది ప్యారడైజ్ అంటూ మరో సరికొత్త సంచలనానికి రెడీ అవుతున్నాడు నాని. ఇప్పటికే ఫస్ట్ స్టేట్మెంట్ గా రిలీజైన ఈ సినిమా టీజర్ చూసి నాని ఫ్యాన్స్ అంతా వారెవా అనేశారు. ఇక నెక్స్ట్ మరో టీజర్ ని రెడీ చేస్తున్నారని తెలుస్తుంది. ఇక ఈ సినిమాలో నాని రెండు జడలతో కనిపించనున్నాడు. నాని 3 వేరియేషన్స్ ఉన్న రోల్స్.. ఈమధ్యనే ఆ జడల్ రోల్ ని పరిచయం చేస్తూ నాని సర్ ప్రైజ్ చేశాడు. ఐతే ఈ మూవీలో నాని 3 వేరియేషన్స్ ఉన్న రోల్స్ లో నటిస్తున్నాడట. ఈ 3 వేరియేషన్స్ లో కూడా అదిరిపోతాయని అంటున్నారు. అంతేకాదు నాని ఒక రోల్ లో నెగిటివ్ కూడా అప్పీల్ కూడా ఉంటుందట. కచ్చితంగా ఈ నెగిటివ్ షేడ్ ఉన్న పాత్రతో నాని తన వర్సటాలిటీ చూపిస్తాడట. ఈ సినిమాతో మరో బ్లాక్ బస్టర్ టార్గెట్ పెట్టుకున్నాడు నాని. శ్రీకాంత్ ఓదెలకు ఫుల్ ఫ్రీడం ఇచ్చి సినిమాను తీయమంటున్నాడు. దసరా మేకర్స్ సుధాకర్ చెరుకూరినే ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఐతే నాని ప్యారడైజ్ లో హీరోయిన్ రోల్ ఎవరు చేస్తున్నారు అన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ది ప్యారడైజ్ సినిమాలో నాని రోల్ తో నేషనల్ ఆడియన్స్ ని సైతం సర్ ప్రైజ్ చేస్తాడని అంటున్నారు. పీరియాడికల్ మూవీగా.. నాని సరిపోదా శనివారం తర్వాత ఈ మూవీ వస్తుంది. ది ప్యారడైజ్ సినిమా పీరియాడికల్ మూవీగా ఫ్యాన్స్ ని మెప్పిస్తుందని అంటున్నారు. నాని, శ్రీకాంత్ మరోసారి ఇద్దరు కలిసి వారి మాస్ చూపించబోతున్నారు. నాని మార్క్ ఎంటర్టైనింగ్ తో పాటు దసరాని మించి నెక్స్ట్ లెవెల్ మాస్ మూవీగా ప్యారడైజ్ వస్తుందని అంటున్నారు. నాని మాత్రం సినిమా మీద ఎన్ని అంచనాలు ఏర్పడినా కూడా దానికి తగినట్టుగా ఉండాలనే కృషి చేస్తున్నాడు. నాని ప్యారడైజ్ ఫస్ట్ గ్లింప్స్ తోనే సినిమా లోని మాస్ వైబ్ ఏంటన్నది చూపించాడు. తప్పకుండా ఫ్యాన్స్ కి ఇదొక మాస్ ఫీస్ట్ అందిస్తే మాత్రం నాని కెరీర్ లో మరింత జోష్ అందుకునే ఛాన్స్ ఉంటుంది. శ్రీకాంత్ ఓదెల ఈ సినిమా హిట్ కొట్టి మెగాస్టార్ చిరంజీవితో సినిమాకు రెడీ అవ్వాలని చూస్తున్నాడు. నాని ది ప్యారడైజ్ సినిమా 2026 మార్చి 27న రిలీజ్ లాక్ చేశారు. ఆ టైం లోనే గ్లోబల్ స్టార్ రాం చరణ్ పెద్ది సినిమా కూడా వస్తుంది.




# కేతిక శర్మ బోల్డ్ ఆఫర్ కి నో చెప్పిందా?




ఢిల్లీ బ్యూటీ కేతిక శర్మ కెరీర్ ప్రారంభించి ఐదేళ్లు అవుతోన్న సంగతి తెలిసిందే. చెప్పుకోవడానికి ఐదారు సినిమాలు చేసింది. కానీ వాటిలో హిట్ అయినవి ఎన్ని అంటే? కనిపించడం కష్టమే. ఇటీవలే రిలీజ్ అయిన 'సింగిల్' మాత్రమే అమ్మడి కెరీర్ లో తొలి హిట్. ట్రయాంగిల్ లవ్ స్టోరీ లో కేతిక పాత్రకు మంచి మార్కు లే పడ్డాయి. చబ్బీ లుక్ లో యువతని ఆకట్టుకుంటుంది. నటనకు ఆస్కారం ఉన్న రోల్ కావడంతో అందరికీ కనెక్ట్ అయింది. దీంతో అమ్మడికి కొత్త అవకాశాలు ప్రారంభమైనట్లుకనిపిస్తుంది. ప్రస్తుతం రాజేష్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోంది. అలాగే కోలీవుడ్ లో కూడా ఛాన్సులొస్తున్నాయి. అందం, అభినయ గల నాయిక కావడంతో ప్రోత్సహించే వారు వెంట పడుతుతున్నారు. ఈనేపథ్యంలో తాజాగా టాలీవుడ్లో ఓ నిర్మాత అప్రోచ్ అయి ఓఛాన్స్ ఆఫర్ చేసాడుట. అయితే అది బోల్డ్ కంటెంట్ ఉన్న చిత్రం కావడంతో కేతిక స్టోరీ విని రిజెక్ట్ చేసిందిట. కథలో కేతిక పాత్ర బాగా బోల్డ్ గా ఉంటుందని.. ద్వితి యార్ధం కథలో మరింతగా బోల్డ్ నెస్ హైలైట్ అవుతుందన్న కారణంగా తిరస్కరించినట్లు తెలిసింది. గాలి తీసేసిన కావడంతో ఆమె ఒప్పుకుంటుందని నమ్మకంతో సదరు దర్శక నిర్మాత కాన్ఫిడెంట్ గా ముందుకెళ్లినా? ఊహించని సమాధానం చెప్పిందని సదరు దర్శక నిర్మాత బయట చెబుతున్నాడు. దీంతో ఇప్పుడాయన మరో నాయికను వెతుక్కునే పనిలో ఉన్నట్లు తెలిపాడు. ఆ హీరో యిన్ కూడా అచ్చంగా కేతిక లుక్ లోనే ఉండే వాళ్లనే ఎంపిక చేస్తానంటున్నాడు. అలాంటి భామ దొరికితే ఒకే లేదంటే? కథలో మళ్లీ మార్పులు చేసి కొత్త భామ కోసం ట్రై చేస్తానన్నాడు. హీరోయి న్లను గుడ్డిగా నమ్మి ముందుకెళ్తే ఇలా ఉంటుంది? అన్నది ఇదో అనుభవంగా చెప్పుకొచ్చాడు. ఏనటి అయినా పోషించే పాత్ర మనసుకు నచ్చితేనే అంగీకరిస్తారు. మనసు చంపుకుని నటించడానికి ఏ నటి సాహసించదన్నది గుర్తించడం అంతే అవసరం.

# బన్నీతో మరో సీనియర్ స్టార్.. పట్టుబట్టి మరీ ఒప్పించిన అట్లీ!



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో భారీ ప్రాజెక్ట్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో హైయెస్ట్ బడ్జెట్ తో సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్ బన్నీ- అట్లీ మూవీని నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సినిమా షూటింగ్ జెట్ స్పీడ్ లో జరుగుతోంది. సైన్స్ ఫిక్షన్ ఫాంటసీ యాక్షన్ డ్రామాగా రెడీ అవుతున్న ఆ సినిమాను అట్లీ ప్రతిష్ఠాత్మకంగా ప్లాన్ చేస్తున్నారు. అగ్రశ్రేణి తారలు, అంతర్జాతీయ సాంకేతిక నిపుణులను రంగంలోకి దించుతున్నారు. ఫిమేల్ లీడ్ రోల్ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె నటిస్తున్నట్లు కొద్ది రోజుల మేకర్స్.. పోస్టర్ తో అనౌన్స్ చేస్తున్న విషయం తెలిసిందే.దీపికపాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న, భాగ్యశ్రీ బోర్సే కూడా నటిస్తున్నారని తెలుస్తోంది. అదే సమయంలో సినిమాలో టాలీవుడ్ సీనియర్ నటి రమ్యకృష్ణ యాక్ట్ చేస్తున్నట్లు కొద్దిరోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఒక ముఖ్యమైన పాత్ర కోసం అట్లీ పట్టుబట్టి మరీ ఒప్పించారని టాక్.బన్నీ తల్లిగా ఆమె కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. తొలిసారి వారిద్దరూ కలిసి వర్క్ చేయనున్నారు. నిజానికి.. ఇప్పటి వరకు అల్లు అర్జున్ ఏ సినిమాలోనూ రమ్యకృష్ణ నటించలేదు. మొదటిసారి ఆ ఫ్రెష్ కాంబో అట్లీ వల్ల సాధ్యమవుతోందని చెప్పాలి. ఒక్క సిట్టింగ్ లోనే అట్లీ నెరేషన్ కు మెచ్చి ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని వినికిడి.ప్రస్తుతం ముంబైలో షూటింగ్ జరుగుతుండగా.. అప్డేట్స్ అసలు పెద్దగా బయటకు రావడం లేదు. ఇప్పుడు అల్లు అర్జున్, మృణాల్ ఠాకూర్ పై సీన్స్ ను మేకర్స్ షూట్ చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పుడు రమ్యకృష్ణ కూడా సెట్స్ లో జాయిన్ అవ్వనున్నారని సమాచారం. ఆమెపై కీలక సన్నివేశాలు త్వరలో చిత్రీకరించనున్నారని సమాచారం.అయితే రమ్యకృష్ణ కీలక పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకర్షించే అవకాశం ఉందని చెప్పాలి. కాగా, అల్లు అర్జున్, అట్లీ మూవీ రిలీజ్ డేట్ పై మేకర్స్ ఎలాంటి ప్రకటన చేయలేదు. 75 శాతం షూటింగ్ అయ్యాక డిసైడ్ చేయనున్నారని సమాచారం.

# "ఇంకా నయం అమరేంద్ర బాహుబలి జై అనలేదు".. జాన్వీపై పంచ్‌లు!



: ఈ ఏడాది ఎప్పటిలానే శ్రీకృష్ణ జన్మాష్ఠమి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా అంగరంగ వైభవంగా సాగాయి. ఆగస్టు 15-17 మధ్య మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాల్లో ఆగస్టు 16న ప్రధానమైన జన్మాష్ఠమి పండగ. ఆరోజు ప్రత్యేకంగా వెన్నకుండ (బటర్ పాట్ బ్రేకింగ్) పగులగొట్టడం, పెరుగు కుండ (దహీ హండి) పగులగొట్టడం సహా సాంస్కృతిక కార్యక్రమాలు, కీర్తన్స్, భజన్స్, విద్యార్థుల కోసం కాంపిటీషన్స్ వంటి ఆచారాలతో దేవాలయాల్లో సందడి నెలకొంది. పిల్లలు పెద్దలు అందరూ సరదాగా ఈ ఉత్సవాలను ఆనందించారు. అనుష్క శర్మ- విరాట్ కోహ్లీ, షాహిద్ కపూర్- మీరా రాజ్ పుత్, హేమమాలిని కుటుంబం, ఉత్తరాదిన ఉన్న సింధీ కుటుంబాలు సహా చాలా మంది సెలబ్రిటీలు శ్రీకృష్ణ జన్మాష్ఠమిని ప్రత్యేకంగా జరుపుకుంటారు. ఈ అసిస్టెంట్ అయితే శ్రీకృష్ణ జన్మాష్ఠమి ఉత్సవాలు తెలుగు రాష్ట్రాల్లోని గ్రామాల్లో పరిమితంగా కనిపించినా కానీ, మెట్రో అర్బన్ ప్రాంతాల్లో దీనికి అంతో ఇంతో ప్రాధాన్యత అయితే ఉంది. స్కూల్, కాలేజెస్ లో ఈ ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నారు. జన్మాష్ఠమి భారతీయ సాంప్రదాయం సంస్కృతిని అత్యుత్తమ రీతిలో ప్రదర్శించే ఒక ఉత్సవం. ఇప్పుడు మహారాష్ట్రలోని ముంబైలో జరిగిన 'దహి హండి' కార్యక్రమంలో జాన్వీ కపూర్ అతిథిగా పాల్గొన్నారు. ఆగస్టు 29 న విడుదల కానున్న తన సినిమా 'పరమ్ సుందరి' ప్రచారంలో భాగంగా ఈ ఉత్సవాల్లో జాన్వీ సందడి చేసారు. వేడుకలో దహీ హండి మట్కీని పగులగొట్టే అవకాశం తనను వరించింది. కానీ ఆ సమయంలో జాన్వీ పండగ ప్రాశస్త్యంతో సంబంధం లేకుండా, 'భారత్ మాతా కీ జై' అంటూ నినదించడం ఆన్‌లైన్ లో మీమ్ ఫెస్ట్ కి దారి తీసింది. చాలామంది జాన్వీ కపూర్ నినాదాన్ని విమర్శించారు.ముంబైలోని ఘాట్కోపర్‌లో జరిగిన ఎమ్మెల్యే రామ్ కదమ్ దహి హండి కార్యక్రమంలో ఈ నినాదం హాస్యాస్పదం అయింది. కొబ్బరికాయను ఉపయోగించి మట్కిని పగులగొట్టిన తర్వాత 'భారత్ మాతా కీ జై' అని జాన్వీ నినదించింది. అయితే ఈ నినాదం స్వాతంత్ర్య దినోత్సవ నినాదమా? మీరు స్వాతంత్ర్య దినోత్సవానికి హాజరయ్యారా? అంటూ కొందరు జాన్వీని ఆటపట్టించారు.

# చరణ్ ఫ్యాన్స్ పిచ్చెక్కి పోతారు

రామ్ చరణ్ ప్రస్తుతం పెద్ది సినిమాతో బిజీగా ఉన్నాడు. ప్రముఖ దర్శకుడు సుకుమార్ ప్రియ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వంలో 'పెద్ది' సినిమాను చరణ్ చేస్తున్నాడు. గత కొన్ని నెలలుగా ఈ సినిమాపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. బుచ్చిబాబు మొదటి సినిమా 'ఉప్పెన'తో బాక్సాఫీస్ వద్ద సందడి చేశాడు. మొదటి సినిమాతో మరే దర్శకుడికి దక్కని రికార్డ్‌లు చాలానే బుచ్చిబాబుకు దక్కాయి. అందుకే ఎన్టీఆర్, చరణ్ వంటి స్టార్స్ సైతం ఆయన దర్శకత్వంలో సినిమాలను చేసేందుకు ఆసక్తిగా ఉన్నారు. ఎన్టీఆర్‌తో సినిమా మొదలు అనుకున్నప్పటికీ కొన్ని కారణాల వల్ల సినిమా క్యాన్సల్ అయింది. వెంటనే రామ్ చరణ్‌తో బుచ్చిబాబు మొదలు పెట్టాడు. రెండో సినిమానే అయినప్పటికీ భారీ అంచనాలు ఉన్నాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఈసినిమా ఉండబోతుందో! రామ్ చరణ్ కు జోడీగా జాన్వీ కపూర్ బుచ్చిబాబు ఈ సినిమాను విభిన్నమైన స్పోర్ట్స్ డ్రామాగా ప్లాన్ చేశారు. ఆకట్టుకునే కథ, కథనంతో ప్రేక్షకుల ముందుకు ఈ సినిమాను తీసుకు రావడం ఖాయం అని అభిమానులు ఎదురు చూస్తున్నారు. అంతే కాకుండా పెద్ది సినిమాలో జాన్వీ కపూర్ నటించిన కారణంగా అంచనాలు భారీగా పెరిగాయి.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**